


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి : 05 సంచిక : 136 పేజీలు : 8


శనివారం 25-10-2025 వెల : 5/-

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD





## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు

### -నిర్లక్ష్యమే కారణమని తేలితే కఠిన చర్యలు తప్పవు



అమరావతి (ప్రశ్న న్యూస్) కర్నూలు సమీపంలో జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై ఆయన శుక్రవారం ఉన్నతస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం, తక్షణమే సహాయక చర్యలు ముమ్మరం చేయాలని, సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదంలో మరణించిన వారి వివరాలను వెంటనే గుర్తించి, వారి కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని వైద్యారోగ్య శాఖకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ ప్రమాదం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లోనూ బస్సుల సాంకేతిక పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ట్రావెల్స్ యాజమాన్యాలకు స్ట్రాంగ్

## జూబ్లిహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు




### -నాలుగు లక్షల మంది ఓటర్లు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల్లో నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల ప్రక్రియలు పూర్తయిన తర్వాత, చివరికి 58 మంది అభ్యర్థులు పోటీకి మిగిలారు. దాఖలైన నామినేషన్లతో పోలిస్తే ఈ సంఖ్య తక్కువే అయినా ఈ నియోజకవర్గంలో ఇంత భారీగా పోటీలో ఉండటం ఇదే మొదటి సారి. అక్టోబర్ 14 నుంచి 16 వరకు జరిగిన నామినేషన్ల సమయంలో పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలుచేసారు. పరిశీలనలో చాలా నామినేషన్లు చెల్లకుండా పోయాయి. చెల్లిన వారిలో 23మంది ఉపసంహరించుకున్నారు. ఫలితంగా 58 మంది మాత్రమే పోటీలో ఉన్నారు. ఈ సంఖ్య గత ఎన్నికలతో పోలిస్తే గణనీయంగా ఎక్కువ.

మిగతా 2లో

# సీఎంను పట్టించుకోని మంత్రులు

## కేబినెట్‌పై రేవంత్ పట్టు కోల్పోయారా.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మంత్రివర్గంలో ముఖ్యమంత్రే కీలకం. ఆయన నియమించిన వారు మాత్రమే మంత్రులు. ఆయన విశ్వాసం కోల్పోతే మంత్రి పదువులు ఉండవు. అలాగే ముఖ్యమంత్రిపై విశ్వాసం కోల్పోయిన మంత్రులూ కేబినెట్‌లో ఉండలేరు. కానీ తెలంగాణ కేబినెట్ లో జరుగుతున్న పరిణామాలు చూస్తే అటు ముఖ్యమంత్రిపై నమ్మకం కోల్పోయిన మంత్రులు ఇటు ముఖ్యమంత్రి కూడా నమ్మక కోల్పోయిన మంత్రులు కనిపిస్తున్నారు. కానీ ఎవర్నీ ఎవరూ కదిలించలేకపోతున్నారు. దీంతో కేబినెట్ లో విబేధాలపై మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది.

**కేబినెట్ సమావేశాల్లో వాగ్వాదాలు జరుగుతున్నాయన్న ప్రచారం**

మంత్రి వర్గ సమావేశాల్లో సాధారణంగా ఏం జరుగుతుందనేది బయటకు రాదు. కానీ లీకుల ద్వారా ఇలా జరిగిందన్న విషయం మాత్రం చాలా మందికి తెలుస్తుంది. ముఖ్యంగా మీడియా ప్రతినిధులకు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో తెలంగాణ కేబినెట్ సమావేశం జరుగుతున్న సమయంలో కొన్ని కొన్ని అంశాల్లో మంత్రుల మధ్య వాగ్వాదం జరుగుతోందన్న ప్రచారం ప్రారంభమయింది. ఏ ఏ అంశాలపై అన్నదానిపై స్పష్టత లేదు కానీ మంత్రులు, ముఖ్యమంత్రి మధ్య కొన్ని విషయాల్లో అభిప్రాయబేధాలున్నాయని, ఈ కారణంగా దూరం పెరిగిందని చెబుతున్నారు. ఇటీవల జూపల్లి కృష్ణారావు నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ లో ఓ టెండర్ విషయంలో పెద్ద వివాదం రేగింది. దానికి సంబంధించిన ఫైల్ సీఎం వద్దనే ఉందని చెబుతున్నారు. ఈ వివాదంలో ఓ ఐఏఎస్ వీఆర్ఎస్ తీసుకుంటున్నారు.

**వరుస వివాదాల్లో మంత్రులు**

మంత్రులు వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. సహచర మంత్రిని సీనియర్ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో కించ పర్చిన అంశం పెద్ద ఇష్యూ అయింది. ఆ మంత్రి హైకమాండ్‌కు ఫిర్యాదు చేశారు. చివరికి పొన్నంతో క్షమాపణ చెప్పించారు. తర్వాత

మిగతా 2లో



## బీహార్‌లో ఎన్డీఏ గెలిస్తే మళ్లీ నితీషే సీఎం

### -ఎన్నికల ప్రచారంలో మోదీ హింటిచ్చేశారా.?

పాట్నా (ప్రశ్న న్యూస్)బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. సమస్తీపూర్‌లో జరిగిన ఎన్‌డీఏ ఎన్నికల మీటింగ్‌లో ముఖ్యమంత్రి నీతిష్ కుమార్‌ను సీఎం అభ్యర్థిగా పరోక్షంగా మోదీ ప్రకటించారు. నీతిష్ కుమార్ నాయకత్వంలో ఎన్‌డీఏ అన్ని ఎన్నికల రికార్డులను అధిగమించే విజయం సాధిస్తుందని ఆయన ప్రకటించారు. ఈ ప్రకటన ఆర్‌జేడీ-కాంగ్రెస్ సీఎం అభ్యర్థి గా తేజస్వి యాదవ్ ప్రకటించడానికి కౌంటర్ గా భావిస్తున్నారు. సమస్తీపూర్ భారతరత్న మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ స్వస్థలం. మొదట కర్పూరి ఠాకూర్ కుఆయన అయన అడుగుజాడల్లో పేదలు, వెనుకబడిన వర్గాలకు సేవ చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఈబీసీలను ఆకట్టుకోవడం ద్వారా బిహార్ ఓటర్లను ఆకర్షించాలని ప్రయత్నిస్తున్నారు. నితీష్ కుమార్ ఆరోగ్యంపై పుకార్లు వస్తున్న సమయంలో తేజస్వీ యాదవ్ బీజేపీ కూటమిపై సెటైర్లు వేస్తున్నారు. నితీష్ ను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని గెలిస్తే ఆయనే సీఎం అవుతారని ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ నితీష్ నేతృత్వంలోనే విజయం సాధిస్తామని ప్రకటించడం సంచలనంగా మారింది. బీహార్‌లో రెండు కూటముల మధ్య పోరు సాగుతోంది. మూడో పార్టీగా ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ ఒంటరిగా పోటీ చేస్తోంది. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో పూర్తి స్థాయిలో ప్రచార బరిలోకి దిగారు. ముఖ్యమంత్రి అభ్యర్థిత్వం కూడా కీలకంగా మారింది. 2020 ఎన్నికల్లో ఎన్‌డీఏ 125 సీట్లు గెలుచుకుంది, మహాగఠ్‌బంధన్ 110 సీట్లు సాధించింది. ఈసారి ఈబీసీలు

మిగతా 2లో



## కర్నూల్ బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)కర్నూలు బస్సు ప్రమాద ఘటన పైన తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. హైదరాబాద్ నుండి బెంగళూరుకు వెళుతున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనలో మరణించిన తెలంగాణ పౌరుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం తరఫున 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ను ప్రకటించింది. గాయపడిన వారికి రెండు లక్షల రూపాయలు సహాయం అందజేస్తామని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఇక కర్నూలు బస్సు ప్రమాద ఘటన పైన స్పందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బాధిత కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం చేయించేలాగా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కర్నూలు సమీపంలో జరిగిన భయానక రోడ్డు ప్రమాద ఘటనలో బైక్ పై వెళ్తున్న వ్యక్తితో

మిగతా 2లో

## కర్నూల్ బస్సు ప్రమాదం కన్నీటిగాథలు



-కర్నూలు వద్ద కావేరి ట్రావెల్స్ బస్సు దగ్ధం

-ప్రమాదంలో 20 మందికి పైగా ప్రయాణికులు సజీవ దహనం

-బైక్ ఢీకొట్టడంతో చెలరేగిన భారీ మంటలు



## స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు ఐక్యరాజ్య సమితి సూచన

### తీవ్రంగా స్పందించిన జైశంకర్

## హైదరాబాద్ కు మహార్దశ

### -6 స్కై వాక్స్ కు రంగం సిద్ధం



2లో

## ఏపీలోనూ హైడ్రా తరహా కార్యాచరణ.?

### -పవన్‌తో రంగనాథ్ భేటీ



2లో

## ప్రభుత్వానికి కాసుల వర్షం

### -మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారా భారీగా ఆదాయం



# సీఎంను పట్టించుకోని మంత్రులు

వివేక్ తోనూ మరో మంత్రి లక్ష్మణ్ కుమార్ కు సరిపడలేదు.ఇక కొండా సురేఖ గురించి చెప్పాల్సిన పని లేదు. పదవి చేపట్టినప్పటి నుండి ఆమె వివాదాల్లోనే ఉన్నారు. ఇటీవల ఆమె కుమార్తె స్వయంగా ముఖ్యమంత్రి, ఆయన కుటుంబసభ్యులపై ఆరోపణలు చేశారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో సీఎంతో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ఇటీవల అలాంటి వారు కూడా సీఎం చుట్టూ కనిపించడం లేదు.

**మంత్రుల పనితీరునూ పట్టించుకోని ముఖ్యమంత్రి**

మంత్రులు ఇలా గాడి తప్పుతున్నా సీఎం రేవంత్ రెడ్డి పెద్దగా పట్టించుకోవడం లేదు. వారి పనితీరుపై లేధా వారు నిర్వహిస్తున్న శాఖల్లో పురోగతిపై ఇప్పటి వరకూ ఎలాంటి సమీక్షలు చేయలేదు. ఆయా శాఖల పనితీరునూ కనీసం పట్టించుకోవడం లేదు. అదే సమయంలో ప్రభుత్వంపై విపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నా మంత్రులు ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. చాలా పరిమిత మంది మాత్రమే విపక్షాలకు కౌంటర్లు ఇస్తూ వస్తున్నారు. మిగతా అందరూ ఎందుకు మాట్లాడటం లేదంటే మాకు ఎందుకు అన్న పద్దతిలో ఉంటున్నారు. ఫలానా అంశంపై స్పందించాలని విపక్ష పార్టీలకు కౌంటర్లు ఇవ్వాలని గట్టిగా చెప్పలేకపోతున్నారు సీఎం రేవంత్.

**మంత్రులకూ హైకమాండ్ వద్ద పలుకుబడి**

తెలంగాణ కేబినెట్ లో ఈ పరిస్థితి రావడానికి హైకమాండ్ కుడా ఓ కారణం అన్న అభిప్రాయం వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి హైకమాండ్ పూర్తి అధికారం ఇవ్వలేదు. తనపై పూర్తి స్థాయిలో తిరుగుబాటు చేసిన మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించాలని ఆయన చేసిన విజ్ఞప్తిని హైకమాండ్ పట్టించుకోలేదని పైగా రాజీ చేసిందని అంటున్నారు. ఎవరూ తన మాట వినకపోతూండటంతో సీఎం కూడా తన పని తాను చేసుకుని పోతున్నారని చెబుతున్నారు. కీలక అధికారుల బదిలీల విషయంలోనూ హైకమాండ్ నుంచే ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇటీవల జరిగిన పోలీసు అధికారుల బదిలీల్లోనూ ఇదే జరిగిందని అంటున్నారు. సీఎం రేవంత్ మంత్రి వర్గంపై సీఎం పట్టు సాధించలేకపోవడానికి హైకమాండ్ అధిక జోక్యమే కారణమని గుసగుసలు వినిపిస్తున్నాయి. కారణం ఏదైనా, తెలంగాణ మంత్రివర్గం మాత్రం సీఎం గ్రిప్ లో లేదని అర్థమైపోతుంది.

# కర్నూల్ బస్సు ప్రమాదం కన్నీటిగాథలు

కర్నూల్ (ప్రశ్న న్యూస్)కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు ఏ క్షణం ఎలా ఉంటుందో చెప్పలేము అన్న పాత మాట ఎంత నిజమో అని నిరూపిస్తూ విధి ఆడిన వింత నాటకానికి నిదర్శనంగా నిలిచింది కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం. దీపావళి పండుగ సందడి ముగిసిన మరికొన్ని గంటల్లోనే తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనుకున్న పందొమ్మిది మందికి పైగా ప్రయాణికుల జీవితాలు అగ్ని ప్రమాదానికి బలైపోయాయి.

**గమనాలు వేరైనా.. గమ్యస్థానం ఒక్కటే..**

దురదృష్టకర రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన ఆ బస్సులో ఉన్న ప్రతి ఒక్కరిదీ ఒక కథ. కొందరు పండుగ సెలవులు ముగించుకుని ఉద్యోగాలకు తిరిగి వెళ్తున్నవారు మరికొందరు తమ భవిష్యత్తు కోసం ఇంటర్వ్యూలకు వెళ్తున్న యువత వీరందరి ప్రయాణ లక్ష్యాలు వేరు కావొచ్చు, కానీ వారి తుది గమ్యం మాత్రం ఆ మృత్యువు ఒడిలోనే దాగి ఉందని ఎవ్వరూ ఊహించలేదు.

**కన్నీరు పెట్టిస్తున్న తల్లీకూతుళ్ల కథ..**

మెదక్ జిల్లా శివ్వాయిపల్లికి చెందిన మంగ సంధ్యారాణి (43), ఆమె కుమార్తె మంగ చందన (23)ల కథ కన్నీళ్లు తెప్పిస్తోంది. సంధ్యారాణి భర్త మంగ ఆనందకుమార్ గౌడ్ మస్కట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవారు. కుమార్తె చందన బెంగళూరులో కుమారుడు వల్లభ అలహాబాద్‌లోని ఐఐటీలో చదువుతున్నారు. బంధువుల పెళ్లి, దీపావళి వేడుకల కోసం ఈ కుటుంబమంతా ఒక్కటయ్యారు. పండుగ ముగిశాక ఆనంద్‌కుమార్ మస్కట్‌కు వెళ్లిపోయారు. జ్వరం కారణంగా సంధ్యారాణి ప్రయాణం వాయిదా పడింది. తల్లిని చూసుకోవడానికి చందన కూడా హైదరాబాద్‌లోనే ఉండిపోయింది. సంధ్యారాణికి జ్వరం తగ్గగానే కుమార్తెను బెంగళూరులో దించి, అక్కడి నుంచి తను మస్కట్‌కు వెళ్లాలని ప్రణాళిక వేసుకున్నారు.

కానీ ఆ వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు వారి ప్రయాణాన్ని శాశ్వతంగా నిలిపివేసింది. నిండు జీవితాలు, నిద్రలోనే సజీవ దహనం అయ్యాయి. ఒకే కుటుంబంలో, ఒకే ఘటనలో తల్లీకూతుళ్లు కనుమరుగవడం ఆ కుటుంబాన్ని తీరని విషాదంలోకి నెట్టింది.

**మురిసిపోయిన సాఫ్ట్‌వేర్ అమ్మాయిలు..**

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన అనూష రెడ్డి, బాపట్ల జిల్లాకు చెందిన ధాత్రి అనే ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దీపావళికి ఇంటికి వచ్చి, సంతోషంగా గడిపి, తిరిగి పని ప్రదేశాలకు వెళ్తూ ఇలా కలకాలం సెలవు తీసుకుంటారని వారి తల్లిదండ్రులు కలలో కూడా ఊహించలేదు.

**ఉజ్వల భవిత కోసం పరుగు..**

బీటెక్ విద్యార్థి జయసూర్య (23) కథ మరో కోణాన్ని చూపింది. ఉద్యోగం కోసం గంపెడాశలతో బెంగళూరులో ఇంటర్వ్యూకు వెళ్తున్న జయసూర్య తాను బుక్ చేసుకున్న బస్సు మిస్సవ్వడంతో ఛేజింగ్ చేసి మరీ మూసాపేట్‌లో బస్సు ఎక్కాడు.

ఎట్టకేలకు బస్సు అయితే ఎక్కాడు కానీ ప్రమాదం అతని వెంటనే ఉందని గమనించలేకపోయాడు. అయితే ఆ ప్రమాదం నుంచి అతడు ఎమెర్జెన్సీ ఎగ్జిట్ నుంచి బయటపడి తన ప్రాణం పోకుండా కాపాడుకున్నాడు.

**నిబంధనల ఉల్లంఘనపై విమర్శలు..**

ఈ తీవ్ర విషాదం వెనుక, ట్రావెల్ బస్సుల నిర్వహణలో ఉన్న లోపాలు చర్చకు వచ్చాయి. ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో రూ. 23 వేల వరకు ఓవర్‌స్పీడ్ చలాన్లు ఉన్నట్లు వెల్లడైంది

. నిబంధనలు పాటించకుండా మితిమీరిన వేగంతో ప్రయాణించడం, ఒడిశా పర్మిట్‌తో మూడు రాష్ట్రాల్లో బస్సును నడపడం వంటి షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం కారణంగానే ఈ నిండు జీవితాలు బలయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటనలో తప్పు ఎవరిదైనా కావచ్చు, కానీ తిరిగి రానివి ఆ అమాయక ప్రాణాలు. విధి రాసిన రాతను ఎవరూ మార్చలేము. నిండు జీవితాలు ఆ మృత్యు జ్వాలల్లో కలిసిపోవడం ప్రతి మనిషి గుండెను కదిలించే కన్నీటి గాథ.

# జూబ్లిహిల్స్ బరిలో 58 మంది అభ్యర్థులు

**211 నామినేషన్లలో చివరికి బరిలో నిలిచింది 58 మమంది మాత్రమే**

మొత్తం 211 మంది అభ్యర్థులు మొత్తంగా 321 నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన గురువారం తెల్లవారుజామున 3 గంటల దాకా కొనసాగింది. మొత్తం 321 నామినేషన్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి 186 నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన 135 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు తేల్చారు. నామినేషన్ల పరిశీలన అనంతరం 130 మందికి చెందిన నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించగా, 81 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం తెలిపారు. వారిలో 23 మంది ఉపసంహరించుకున్నారు.

**కాంగ్రెస్ ఓడించేందుకు అంటూ నిరుద్యోగులు, ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు పోటీ**

2009 ఎన్నికల్లో 13 మంది, 2014లో 21 మంది, 2018లో 18 మంది పోటీ పడ్డారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 19 మంది పోటీ పడ్డారు. ఈ 19 మందిలో బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన మాగంటి గోపీనాథ్ గెలుపొంది వరుసగా మూడోసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు.

ఆయన మరణించడంతో ఉపఎన్నిక అనివార్యమయింది. ఫార్మాసిటీ, ట్రిపుల్‌ఆర్ బాధితులు, నిరుద్యోగులతోపాటు వివిధ వర్గాలకు చెందిన వారు నిరసన రూపంలో నామినేషన్లు దాఖలు చేసి పోటీలో ఉన్నారు. వారు తాము కాంగ్రెస్ ను ఓడించడమే లక్ష్యంగా పోటీ చేస్తున్నామని ప్రకటించారు

**మూడు ప్రధాన పార్టీల రసరత్తువ పోరు – జోరు ప్రచారం**

బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార బాధ్యతలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పలువురు కీలక నేతలకు అప్పగించారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనుంది టీబీజేపీ. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డితో పాటు బండి సంజయ్ కుమార్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారం చేయనున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీజేపీ ప్రచారానికి ఉత్తరప్రదేశ్ , గోవా రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ తరపున సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షోలను నిర్వహించే అవకాశం ఉంది.

# ప్రభుత్వానికి కాసుల వర్షం

**-మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారా భారీగా ఆదాయం**

**-2,620 దుకాణాల కోసం.. రూ.2,863 కోట్లు**

**-గతేడాదితో పోలిస్తే ఈసారి 218 కోట్లు అదనం**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)రాష్ట్రంలో మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ నిన్నటితో ముగిసింది. అయితే గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి మద్యం దుకాణాలకు దరఖాస్తులు తక్కువగానే వచ్చాయి. అయినా సరే ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని దాదాపు చేరుకుంది. ఆదాయపరంగా చూసుకుంటే గత సంవత్సరం కన్నా ఈ సారి మద్యం దుకాణాల దరఖాస్తుల మీద ప్రభుత్వానికి రూ.218 కోట్లు అదనంగా వచ్చాయి. మద్యం దుకాణాల దరఖాస్తు గడువు గురువారం అనగా అక్టోబర్ 23నాటికి ముగిసింది. ఈ సంవత్సరం మద్యం దుకాణాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 95,436 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.2,863 కోట్ల ఆదాయం వచ్చింది. గతంతో పోల్చితే ఇది రూ.218 కోట్లు అధికం. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ గత నెల అనగా సెప్టెంబరు 25న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ మరసటి రోజు నుంచి అనగా సెప్టెంబర్ 26 నుంచి మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలు పెట్టింది. పోయిన మద్యం షాపుల దరఖాస్తులకు సంబంధించి.. దాదాపు 1.32 లక్షల అప్లికేషన్ల విక్రయం ద్వారా ఎక్సైజ్ శాఖకు దాదాపు రూ.2,645 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే ఈసారి మాత్రం దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గింది.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం షాపులకు ఈసారి కేవలం 95,436 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

అయితే ఈసారి అప్లికేషన్ల సంఖ్య తగ్గినా దరఖాస్తు రుసుమును పెంచడంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం చేరింది. గతంలో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉండగా ఈసారి ఆ మొత్తాన్ని రూ.3 లక్షలకు పెంచారు. అలానే మద్యం దుకాణాల అప్లికేషన్ల విక్రమం ద్వారా రూ.3 వేల కోట్ల ఆదాయం ఆర్జించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దాదాపు చేరుకుంది. ఈసారి ఎక్సైజ్ శాఖ అధికారులు ఎక్కువ సంఖ్యలో జనాలు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా ప్రచారం కూడా చేశారు. ఈ నెల 18 అర్ధరాత్రి వరకు 89,344 మంది దరఖాస్తు చేశారు. అయితే అదే రోజు తెలంగాణ వ్యాప్తంగా బీసీ బంద్‌కు పిలుపునివ్వడంతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు.

దీంతో పలువురు వ్యాపారుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం నెల 23 వరకు గడువు పొడిగించింది. దీంతో 95 వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. ఇక ఈనెల అనగా అక్టోబర్ 27న డ్రా తీసి వ్యాపారులను ఎంపిక చేయనున్నారు. డిసెంబర్ ఒకటి నుంచి కొత్త దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈసారి ఒక్కో అప్లికేషన్‌కు రూ.3 లక్షల ఫీజు తీసుకున్నారు. ఇది నాన్ రిఫండబుల్. అలానే ర2023లో వచ్చిన అప్లికేషన్ల సంఖ్య 1.31 లక్షలు కాగా ఈ సారి దాదాపు 36 వేల అప్లికేషన్లు తగ్గాయి. ఫీజు రూ.3 లక్షలు చేయడంతో ఈ సారి అప్లికేషన్లు తగ్గినా ఆదాయం క్రితం సారి వచ్చినందే వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో మద్యం దుకాణానికి సగటున 36 దరఖాస్తులు వచ్చాయి. మద్యం దుకాణాల దరఖాస్తుల్లో శంషాబాద్ ఎక్సైజ్ డివిజన్ నుంచి అత్యధికంగా అప్లికేషన్లు వచ్చాయి. 8,502 అప్లికేషన్లతో శంషాబాద్ డివిజన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక కుమ్రం భీం నుంచి అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ నుంచి కేవలం కేవలం 667 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## బీహార్‌లో ఎన్డీఏ గెలిస్తే మళ్లీ నితీషే సీఎం

(17% ఓటు బ్యాంక్), యాదవులు, ముస్లింలు మీద పోటీ ఉద్ధృతమవుతోంది. మోదీ ప్రకటన ఎన్‌డీఏలో నీతిష్ కుమార్‌కు బలం చేకూర్చడంతో పాటు, బీజేపీ అంతర్గత విభేదాలను అణచివేయడానికి ఉద్దేశించినదిగా విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు

వార్నింగ్ ఇచ్చారు. ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని విచారణలో తేలితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని పునరుద్ఘాటించారు. ప్రమాదానికి గురైన బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వంటి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులను కోరారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని వీలైనంత త్వరగా అందిస్తామని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. అధికారులు ఇప్పటికే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రజల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## హైదరాబాద్ కు మహర్దశ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజధాని హైదరాబాద్ లో పట్టణ జనాభా రోజురోజుకూ పెరిగిపోతుంది. భాగ్యనగరంలో వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. ట్రాఫిక్ లోనే గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. రోడ్లన్నీ రద్దీగా మారిపోతున్నాయి. దీంతో రోడ్డు పక్కన నడిచే పాద చారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక రద్దీ ప్రాంతాల్లో అయితే అడుగు తీసి అడుగు వేయడం నరకంగా మారుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్ లోని రద్దీ ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో పాద చారులు, మహిళలు, చిన్నారులు సులువుగా నడుచుకుంటూ వెళ్లేందుకు స్కై వాక్స్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.గ్రేటర్ హైదరాబాద్ లోని 6 రద్దీ ప్రాంతాల్లో 6 స్కై వాక్స్ ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విధానం ద్వారా ట్రాఫిక్ ను తగ్గించడంతో పాటు రద్దీ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను కూడా నివారించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో నగరంలోని అఫ్జల్ గంజ్, మదీనా, లక్డీ–కా–పూల్, బీహెచ్ఈఎల్, జేఎన్టీయూ, మియాపూర్ టీ– జంక్షన్ లో స్కై వాక్స్ ను నిర్మించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించాలని హైదరాబాద్ మెట్రో డెవలప్ మెంట్ ఆథారిటీ(హెచ్ఎండీఏ) కు ఆదేశాలు జారీ చేసింది.హైదరాబాద్ లోని ఈ ఆరు ప్రాంతాలు నిత్యం రద్దీగా ఉంటున్నట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో పాద చారులు రద్దీ రోడ్లపై నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తేల్చారు. ఇదే ప్రాంతాల్లో ట్రాఫిక్, రద్దీ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. అందువల్ల ఈ ప్రాంతాల్లో స్కై వాక్స్ నిర్మిస్తే పాద చారులు సులభంగా రోడ్డు దాటడం ఉంటుందని రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఉప్పల్ స్కై వాక్ కు విశేష స్పందన వచ్చింది. ఈ స్కై వాక్ ను నగర ప్రజలు అద్భుతంగా వినియోగించుకుంటున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఇక మెహదీపట్నం వద్ద కూడా ఓ స్కై వాక్ ను నిర్మిస్తున్నారు. అలాగే సికింద్రాబాద్ లోని రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, మెట్రో స్టేషన్ కు కలుపుతూ మరొక స్కై వాక్ నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. మరోవైపు లీ అసోసియేట్స్ ఇటీవల నిర్వహించిన సర్వేలో హైదరాబాద్ లోని 23 రద్దీ ప్రాంతాల్లో స్కై వాక్స్ అవసరం అని నివేదించింది. ఈ క్రమంలో తొలుత ఈ ఆరు ప్రాంతాల్లో స్కై వాక్స్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## ఏపీలోనూ హైడ్రా తరహా కార్యాచరణ.?

అమరావతి (ప్రశ్న న్యూస్)ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ సమావేశమయ్యారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్‌లో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల రక్షణకు హైడ్రా కృషి చేస్తోన్న విషయం తెలిసిందే. హైడ్రా హైదరాబాద్ నగరంలో కోట్లాది రూపాయల విలువ చేసే భూములను పరిరక్షించింది. ఈ నేపథ్యంలో వీరి మధ్య రెండు గంటల పాటు సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. హైదరాబాద్ నగరంలో హైడ్రా పనితీరు తదితర అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే, ఈ భేటీ మర్యాదపూర్వకంగా జరిగిందని పవన్ కల్యాణ్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో హైడ్రా కూల్చివేతలు చేపట్టినప్పుడు ఏపీలోనూ అలాంటి వ్యవస్థ ఉండాలని పవన్ ఆకాంక్షించారు. ఈ క్రమంలో వీరి మీటింగ్ జరగడం ఆసక్తికరంగా మారింది.

## స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు ఐక్యరాజ్య సమితి సూచన

## తీవ్రంగా స్పందించిన జైశంకర్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మైనారిటీల రక్షణ, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులను కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ గట్టిగా స్పందించారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఐరాస నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించలేవని స్పష్టం చేశారు. ఐరాస 80వ వార్షికోత్సవం సందర్భంగా పోస్టల్ స్టాంపు విడుదల చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వివాదాల యుగంలో శాంతి అవశ్యమని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ఐక్యరాజ్య సమితిలో అంతా సరిగా లేదని అన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితిలో మార్పులు జరిగేలా సంస్కరణలు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితికి భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని, అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ ఐక్యరాజ్య సమితి నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. జాత్యాహంకారం, వివక్ష, విదేశీయులపై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను స్విట్జర్లాండ్ ఎదుర్కొంటున్న సంగతిని ఆయన ప్రస్తావించారు.

## కర్నూల్ బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

సహా మొత్తం 20 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది.

**మృతులను గుర్తిస్తున్న అధికారులు**

మంటల్లో కాలిపోయిన బస్సు నుంచి ఇప్పటివరకు 19 మృతదేహాలను వెలికితీయగా ఫోరెన్సిక్ బృందాలు శవ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ బస్సు ప్రమాద ఘటనలో తెలంగాణకు చెందిన వారు ఇంకా ఎంతమంది ఉన్నారు అనే వివరాలు నిర్ధారించవలసి ఉంది. కర్నూలు బస్సు ప్రమాదంలో మెదక్ జిల్లాకు చెందిన తల్లి కుమార్తె మృతి చెందినట్లు చెబుతున్నారు. మృతులను మెదక్ జిల్లా శివ్వాయి పల్లికి చెందిన తల్లి కూతుర్లు సంధ్యారాణి, చందన గా గుర్తించారు.

తెలంగాణా నుండి మృతుల వివరాల కోసం ఆరా

తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కొండూరు కు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పని చేస్తున్న అనూష రెడ్డి కూడా మృతి చెందినట్టు నిర్ధారించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన బస్సులో సూరారం, జేఎన్టీయూ, పటాన్ చెరువు ప్రాంతాల నుంచి పలువురు ఉన్నారు. జెఎన్టియు వద్ద ఎక్కిన ముగ్గురిలో ఒకరు సురక్షితంగా బయటపడగా మరో ఇద్దరి ఆచూకీ తెలియడం లేదు.

తెలంగాణా నుండి ఎందరు

**మృతి చెందారో ఇంకా తేలని లెక్క**

సూరారం వద్ద ఎక్కిన గుణ సాయి అనే వ్యక్తి కిటికీ ద్వారా దూకి ప్రాణాలతో బయటపడ్డాడు. ఇక మరో ప్రయాణికుడు ఫోన్స్ స్విచ్ ఆఫ్ లో ఉండడంతో అతను కూడా మరణించి ఉంటాడని భావిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువుకు చెందిన పిలోమీ నాన్ బేబీ, కుమారుడు కిషోర్ కుమార్ ఆచూకీ కూడా తెలియడం లేదు. దీంతో వీరు కూడా మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. అయితే మొత్తం ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంత మంది మృతి చెందారు అనేది పూర్తి వివరాలు తెలియలేదు. ప్రస్తుతం సంఘటన స్థలంలోనే డిఎన్ఎ పరీక్షలు, పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
శనివారం 25 అక్టోబర్2025

## ఆండాళ్ అమ్మవారికి ఉంజల్ సేవ





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)శుక్రవారం సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి ఉంజల్ సేవను కన్నుల పండుగగా నిర్వహించారు ఆలయ అర్చకులు.ఆండాళ్ అమ్మవారిని ఆలయ తిరు మాడ వీధుల్లో సేవపై ఊరేగించారు.ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు.ప్రధానాలయం లోని అద్దాల మండపంలో ఉయ్యాల పై అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు,తులసి దళాలతో అలంకరించి ఆరాధించారు. అర్చకులు హారతి నివేదించారు.మేళతాళాలు, మంగళ వాయిద్యాలు వేద మంత్రాల నడుమ ఉంజల్ సేవ నిర్వహించి ఆండాళ్ అమ్మవారికి నివేదన సమర్పించారు.ఆండాళ్ అమ్మవారి సేవలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## ట్రాక్టర్ ట్రాలినీ డీకొట్టి యువకుడి దుర్మరణం

### కేసు నమోదు చేసిన పోలీసులు



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్)రాచర్ల బొప్పాపూర్ శివారులోని సత్య పీర్ల దర్గా సమీపంలో సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారి పై ట్రాక్టర్ ట్రాలీని తన ద్విచక్ర వాహనంతో వెనుక నుండి ఢీకొట్టి గజసింగవరం గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీను అనే యువకుడు దుర్మరణం చెందినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ ఐ రాహుల్ రెడ్డి తెలిపారు. ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం గంభీరావుపేట మండలంలోని గజసింగవరం గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీను తన గ్లామర్ బైక్ పై ఎల్లారెడ్డిపేటకు వస్తుండగా సత్యపీరీల దర్గా మూల మలుపు వద్ద ఉదయం పదిగంటలకు తన ముందు వెళుతున్న ట్రాక్టర్ ట్రాలీని డి కొట్టాడు.తలకు బలమైన గాయాలు కావడంతో 108 అంబులెన్స్ వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా శ్రీను అప్పటికే మరణించినట్లు ఆసుపత్రి డాక్టర్లు ధృవీకరించడంతో మృతిని సోదరుడు శివరాత్రి నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ ఐ రాహుల్ రెడ్డి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### మున్నూరుకాపు సంఘం బలోపేతమే మన బలం

### మున్నూరుకాపు సంఘం మండల

### ప్రధానకార్యదర్శి : అమిరిశెట్టి భూమి రెడ్డి

### మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నేతలకు ఘన స్వాగతం - సన్మానం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో మున్నూరుకాపు సంఘం బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం దిశగా మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల మల్లేశం శు క్రవారం మండల కేంద్రానికి విచ్చేసారు.మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నేతలకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాలు కప్పి సన్మానం చేశారు.సభ్యత్వ నమోదు బుక్కులను నేతలు అందజేశారు.ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి భూమిరెడ్డి మాట్లాడుతూ, “సమాజ అభివృద్ధికి ప్రతి మున్నూరుకాపు సభ్యుడు ముందుకు రావాలి. సంఘం బలోపేతమే మన సమూహ బలం. యువతలో ఐక్యత పెంపొందించుకోవాలి, విద్యా%-%ఉద్యోగ రంగాల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగాలి,” అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు బుచ్చి రాములు, జిల్లా సంయుక్త కార్యదర్శి చిందం రమేష్,రాధ అంజయ్య,బుర్ర రాజు, నంది సత్తయ్య, మాడిశెట్టి జనార్దన్, చేపూరి సుధాకర్, మహిపాల్, రాంబాబు,మండలంలోని వివిధ గ్రామాల సంఘం కుల బాంధవులు పాల్గొన్నారు.

# వద్దంటే కురుస్తున్న వర్షాలు..!!







### - తడిసి ముద్దవుతున్న తెల్ల బంగారం..

### - చేజారి పోతున్న పంటను చూసి కన్నీరు పెడుతున్న రైతులు..

జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 24: మండలరైతులకు వర్ష భయం వీడటం లేదు. వర్షాలు ఊహించని విధంగా మోస్తరు నుంచి భారీ స్థాయిలో పడుతూ, రైతులను నిత్యం అశాంతికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం సమయాల్లో వాతావరణం శాంతంగా కనిపించినా, సాయంత్రం నుంచి రాత్రివరకు పరిస్థితి పూర్తిగా మారిపోతోంది. వర్షాలు ఊహించని వేగంతో పడుతూ, రహదారులు జలమయంగా మారుతున్నాయి. తాజాగా హైదరాబాద్ వాతావరణ కేంద్రం విడుదల చేసిన నివేదిక ప్రకారం, బంగాళాకాతంలో ఏర్పడిన అల్పపిడనం వలన మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. చేతికొచ్చే దశలో పత్తి పంట రైతుల ఆశలను ఆవిరి చేస్తుంది నిత్యం కురుస్తున్న వర్షాలతో పత్తి పంట దెబ్బతింటుంది. అల్పపీడన ప్రభావంతో అతివృష్టితో చేజారిపోతున్న పంటను చూసి కంట కన్నీరు పెడుతున్నాడు రైతన్న. దాదాపు రెండు నెలలుగా పడుతున్న వర్షాలతో పత్తి చెట్టుకు ఉన్న పూత, పిందెలు రాలిపోతున్నాయి. కాసిన కాయల సైతం కుళ్ళిపోతున్నాయి. ఈ వర్షంతో పత్తి పంట నష్టం వాటిల్లినట్లు. రైతులు ఆవేదన చెందుతున్నారు..

**– పత్తి దిగుబడి కష్టమే.!**

దుక్కులు దున్నడం మొదలు విత్తనాలు ఎరువులు, కూలీలు ఖర్చుతో మండల రైతులు ఎకరానికి రూ 25 వేల నుంచి 40 వేల వరకు ఖర్చు చేశారు. వర్షాలు ఆలస్యంగా కురవడంతో విత్తనాలు ఆలస్యంగా వేసుకున్నారు. కొందరు రైతులు ముందుగా విత్తనాలు వేసుకోవడంతో విత్తనాలు మొలకెత్తక రెండోసారి వేసుకోవడంతో అల్పపీడనంతో వదలని వాన దిగుబడి కష్టమే ఉన్నట్లుగా రైతన్న పరిస్థితి నెలకొంది. సాధరన వర్షపాతం కంటే ఇప్పుడు గాలి వానలతో వర్షపాతం రావడంతో పత్తి చేల్లో తడి ఆరకపోవడంతో పత్తి చేల్లో కలుపు తీసే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి తోడు చీడపీడల సమస్య మొదలైంది. పత్తి పంట ఎర్రబారిపోతుంది. పత్తి నాణ్యత కోల్పోవడంతో దిగుబడితో పాటు ధర కూడా రాకపోవచ్చు అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ సి,సి కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు వచ్చిన పంట కూడా కోసే పరిస్థితి లేదు.

**– పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు.!**

**నీలాల కిసిందరావు రైతు, వెంగన్నపాలెం గ్రామం..**

గత పది రోజుల నుంచి పడుతున్న వర్షాల వల్ల పత్తి పంట దెబ్బతింటుంది పెట్టుబడులు కూడా వచ్చేలా కనిపించడం లేదు. పత్తి పంట తేమకు నేలతాకి పడిపోవడం జరిగింది. వర్షానికి పత్తి చేనులో కాయలు కుళ్ళి పోతున్నాయి. ఆకులు ఎర్ర పడుతున్నాయి..

**– కలుపు పెరుగుతుంది.పత్తి నల్ల బడింది..!!**

**ఇల్లంగి తిరుపతి, రైతు జూలూరుపాడు గ్రామం.**

రెండు ఎకరాల్లో రూ 58వేలు పెట్టుబడి పెట్టి పత్తి సాగు చేశాను. కురుస్తున్న వర్షాలకు పత్తి నల్ల బడింది. పూత రాలిపోతుంది. మందులు పిచికారి చేసిన పంట కోలుకోవడంలేదు. తరచు వర్షాలు కురుస్తుండటంతో పత్తిలో కలుపు పెరుగుతుంది పత్తి చెట్లు పెరగడం లేదు. కలుపు పెరుగుతుంది. వర్షాలతో అవస్థలు పడుతున్నాం..

# శ్రీకాళహస్తి దేవస్థానం

# పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం

శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా తెలుగుదేశం పార్టీ నాయకులు (గోపి, లక్ష్మమ్మ, గుర్రప్పశెట్టి,) నేడు ప్రమాణ స్వీకారం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్ రెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నరసింహయాదవ్ , బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథితులు నడుమ ఆలయ అధికారులు పాలకమండలి సభ్యులకు స్వీకారం నిర్వహించారు..

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ. శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నేడు బిజెపి పార్టీకి చెందిన కోలా విశాలాక్ష్మి అదేవిధంగా తెలుగుదేశం పార్టీకి చెందిన(గోపి, లక్ష్మమ్మ, గుర్రప్పశెట్టి,) ముగ్గురు వ్యక్తులు పాలకమండలి సభ్యులుగా వారి వారి జన్మరాశులను బట్టి నేడు ముహూర్తం ఖరారవడంతో ప్రమాణ స్వీకారం చేశారని తెలియజేశారు.. పాలకమండలి సభ్యులు ఆలయఅభివృద్ధికి కృషి చేయాలని కోరారు. శ్రీకాళహస్తిలో పాలకమండలి



సభ్యులతో పాటు ప్రత్యేక అతిథులుగా పరిశ్రమలకు చెందిన కొంతమంది వ్యక్తులను నియమిస్తే ఆలయం అభివృద్ధికి వారు దాతలా కృషి చేస్తారని సందర్భంగా తెలియజేశారు. దాతల సహాయంతో శ్రీకాళహస్తి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసే విధంగా ఈ పాలకమండలి పనిచేస్తుందన్నారు.

# బాలికల గురుకుల విద్యాలయం

# ఆకస్మిక తనిఖీ: ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్

### ఉద్యోగాలు, ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడి ఆదర్శంగా నిలవాలి

### ప్రతి విద్యార్థిని తమ ప్రాంత పిల్లలకు స్ఫూర్తిగా ఉండాలి

తంగళ్లపల్లి( ప్రశ్న న్యూస్) విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించి, వివిధ ఉద్యోగాల్లో, ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడి మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ పిలుపునిచ్చారు. నేరెళ్లలోని తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించి, ఎవరైనా సెలవులో ఉన్నారా అని ఆరా తీశారు. సెలవుల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. కిచెన్ లో మెనూ చార్ట్ ను పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే వివరాలను సిబ్బందిని అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ లో ఉన్న కూరగాయలు, కోడిగుడ్లు పరిశీలించారు. నాణ్యత సరిగా లేకపోవడంతో వాటిని సరఫరా చేసే కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. అందుబాటులో ఉన్న సరకుల వివరాల రిజిస్టర్ ను పరిశీలించారు. విద్యార్థుల వసతి గదులు పరిశీలించి, ఏమైనా



ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు.ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్ మీ అధ్యాపకుల భోధన ఎలా ఉంది.? పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారు.? ఇంటర్మీడియట్ పూర్తయ్యాక ఎవరెవరు ఏయే విభాగాల్లో విద్యను అభ్యసించడానికి ఆసక్తిగా ఉన్నారు? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అనే వివరాలను క్లుప్తంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిని నిత్యం విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభ కనబర్చి టీచర్, లాయర్, ఇంజనీర్, డాక్టర్, తదితర రంగాల్లో స్థిరపడాలని, ఆర్థికంగా స్వతంత్రత సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానాలకు ఎదిగితే తమ ప్రాంతంలోని మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తారని స్పష్టం చేశారు. మెనూ లో అందించే పోషకాహారం ఖచ్చితంగా తినాలని సూచించారు. కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే మీరు నిర్దేశించుకున్న లక్ష్యం ఎంత పెద్దదైనా అది సాధించడానికి, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి సులభతరం అవుతుందని, ఈ విషయాన్ని గ్రహించి చదవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తనిఖీలో తహశీల్దార్ జయంత్, ప్రిన్సిపాల్ రాధ ఉన్నారు.

# దమ్మన్నపేట గ్రామం లో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు

### - కోటి మంది మహిళలను కోటీశ్వరుడు చేసే కార్యక్రమంలో మహిళలకు వరి కొనుగోలు కేంద్రాలు

ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం దమ్మన్నపేట గ్రామం ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.కోటి మంది మహిళ లను కోటీశ్వరుడు చేసే కార్యక్రమంలో మహిళలకు వరి కొనుగోలు కేంద్రలను కేటాయించడం అందుకు ఉదాహరణ మహిళలు మహాశక్తి లాగా ఎదగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన ఎమ్మెల్యే భూపతి రెడ్డి



ఆదేశాల మేరకు ఐకెపి ద్వారా వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వాటి నుంచి మంచి లాభాలు సాధించాలని అటు రైతులకు ఇటు వ్యాపారులకు అనుసంధానం గా నిలుస్తారని ఆశిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ధర్పల్లి మండల ఐకెపి ఏపీఎం చిన్నయ్య, సెంటర్ ఇన్చార్జ్ అరుణ, వి ఓ ఏ గంగాలక్ష్మి, అధ్యక్షురాలు లావణ్య, కార్యదర్శి శ్యామల, కోశాధికారి గంగామణి ఉపాధ్యక్షులు మర్త,సహాయ కార్యదర్శి మంజుల, వీడీసీ చైర్మన్ కళ్ళ నడిపి గంగారం, క్యాషియర్ శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సుదర్శన్, మాజీ సర్పంచ్ శేఖర్,వడ్ల జలేందర్, కళ్ళ మోహన్, కుమ్మరి మోహన్, రైతులు సభ్యులు పాల్గొన్నారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక

శనివారం 25 అక్టోబర్2025

## జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి - సిఐటియు పిలుపు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఈనెల 25న జరిగే సిఐటి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహాసభలను విజయవంత చేయాలని మెడిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు ఈ సందర్భంగా సిఐటియు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా మొత్తం కార్మిక వర్గంతో నిండి ఉన్నదని జిల్లాలో భారీ కంపెనీలు ఉన్నాయి అన్నారు. ఈ కంపెనీలలో లక్షలాదిమంది కార్మికులు పనిచేస్తా ఉన్నారని తెలిపారు. అయితే వీరికి ఎలాంటి కనీస వసతులు లేకుండా ఏఎస్ఐ పిఎఫ్ లేకుండా పనిచేస్తున్న కార్మికులు చాలామంది ఉన్నారన్నా రు. ఉద్యోగ భద్రత లేకుండా, ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్ లు లేకుండా అనేకమంది కార్మికులు పనులు చేస్తున్నారని తెలిపారు. పొట్ట కూటి కోసం వచ్చి చాలామంది అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారందరి సమస్యలు పరిష్కరించేందుకు , కార్మిక హక్కులను కాపాడడం కోసం ఈ మహాసభలను నిర్వహిస్తున్న మని తెలిపారు. కార్మిక వర్గం అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ మండల కన్వీనర్ ఎం.నరేష్, మెడిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి దేవేందర్, యూనియన్ నాయకులు లక్ష్మణ్ నాయక్ , బాణ్య నాయక్, మీట్య నాయక్, ఎల్లమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) గుండ్ల పోచంపల్లి, దూలపల్లి లీడర్ కింద విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ ఏఈ కె విజయకుమార్ తెలిపారు. దూలపల్లి ఫీడర్లో 33/11కే వి చెట్లు నరికే కార్యక్రమం ఉన్నందున ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంటు సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఇదేవిధంగా గుండ్ల పోచంపల్ల ఎస్ ఎస్ నుండి 11/కేవీ దూలపల్లి ఫీడర్ లో చెట్ల నరికివేత పనుల ఉదయం 10 గంటల నుండి 3 గంటల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోధాలు ఇందుకు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ కె విజయకుమార్ తెలిపారు

### జాగృతి లోకి సీనియర్ నాయకుడు

### చంటి శ్రీనివాస్ - కవిత సమక్షంలో చేరిక

### జాగృతి బలోపేతానికి చంటి శ్రీనివాస్ చేరికతో నూతన శక్తి

### కవిత కండువా కప్పి ఆహ్వానం %-% జాగృతి సేవా కార్యక్రమాలు

### ఆకట్టుకున్నాయన్న శ్రీనివాస్



కరీంనగర్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ అంబేద్కర్ సంఘం కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చంటి శ్రీనివాస్ తెలంగాణ జాగృతి లో చేరారు. గురువారం హైదరాబాద్‌లో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఆయన జాగృతిలో చేశారు. ఈ సందర్భంగా కవిత చంటి శ్రీనివాస్‌కు జాగృతి కండువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జాగృతి సంస్థ చేపట్టే విద్యా,సాంస్కృతిక,సేవా కార్యక్రమాలు తనను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభివృద్ధికి,యువతలో చైతన్యం నింపేందుకు జాగృతి వేదికగా తాను సేవ చేయాలనుకుంటున్నానని వెల్లడించారు. జాగృతి అనేది తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి నుంచి పుట్టిన సంస్థ అని, ఇందులో చేరే ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవ తెలంగాణ నిర్మాణానికి తోడ్పడతారని కవిత పేర్కొన్నారు. శ్రీనివాస్ చేరికతో జాగృతికి కొత్త ఉత్సాహం,బలం లభించిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్,నాయకులు మక్కల తిరుపతి,ఇతర స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

### %ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన

### మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్



ఘట్కేసర్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ నియోజకవర్గంలోని ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఘనపురం గ్రామంలో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ పూజా కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పేద కుటుంబాలకు స్వంత గృహ సాకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు అందజేసింది. ఈ పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూరింది అని తెలిపారు. లబ్ధిదారులు మాట్లాడుతూ రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో తమకు సొంత ఇల్లు కలగజేసినందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ వజ్రేష్ యాదవ్ జీవితాంతం రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్లిపెద్ది శరత్ చంద్రా రెడ్డి మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాకు అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పావని జంగయ్య యాదవ్ ఘట్కేసర్ పోచారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాలు యాదవ్,సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సగ్గు అనిత సామల అమర్ మచందర్ రెడ్డి మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ రూప్ సింగ్ నాయక్ వెంకటేష్ ముదిరాజ్ ఎస్టీ సెల్ నాయకులు నానావత్ సురేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల్లో అవగాహనతోనే మార్పు సాధ్యమైంది

### - హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

### -15 నెలల వ్యవధిలో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమి పరిరక్షణ

### -కాపాడిన భూమి విలువ సుమారు రూ.60 వేల కోట్లు ఉంటుందని వెల్లడి

### -ప్యాట్నీ నాలా విస్తరణతో 7 కాలనీలకు తప్పిన వరద ముప్పు

### -నగరంలో 61 శాతం చెరువులు మాయమయ్యాయని ఆందోళన




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజల్లో సరైన అవగాహన కల్పించినప్పుడే ఎలాంటి మార్పు అయినా సాధ్యమవుతుందని, ఆ దిశగా తాము విజయం సాధించామని హైడ్రా (హైదరాబాద్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ అండ్ రీజనరేషన్ ఏజెన్సీ) కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఒకప్పుడు హైడ్రా ఎందుకు ఏర్పాటైంది, దాని లక్ష్యాలు ఏమిటి అనే విషయాలపై స్పష్టత ఉండేది కాదని, కానీ ఇప్పుడు చిన్న పిల్లలకు కూడా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల గురించి వివరించేంత చైతన్యం వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలు అర్థం చేసుకున్నప్పుడే వ్యవస్థలు విజయవంతంగా పనిచేస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ కల్చర్ అండ్ డిప్లమాటిక్ రిలేషన్స్ (ఐసీసీడీఆర్) ఆధ్వర్యంలో శు క్రవారం గ్రీన్ పార్క్ హెూటల్‌లో "మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణల అవసరం" అనే అంశంపై ఒక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగనాథ్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగానే హైడ్రా పనిచేస్తోందని తెలిపారు. సాంస్కృతిక, పర్యావరణ పరిరక్షణకు ఐరాస ఎలా ప్రాధాన్యత ఇస్తుందో, అదే స్ఫూర్తితో నగరంలో మెరుగైన జీవన ప్రమాణాల కోసం చెరువులు, నాలాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని వివరించారు.

**వరద నివారణ, భూముల పరిరక్షణే లక్ష్యం**

ఈ ఏడాది భారీ వర్షాలు కురిసినా నగరాన్ని వరదల నుంచి కాపాడగలిగామని రంగనాథ్ తెలిపారు. చెరువులు, వాటిని అనుసంధానించే నాలాలను కాపాడుకోకపోతే నగరాలు నీట మునగడం ఖాయమని హెచ్చరించారు. ప్యాట్నీ నాలాను విస్తరించి, పూడిక తొలగించడం ద్వారా దాదాపు 7 కాలనీలకు వరద ముప్పు తప్పించామని గుర్తుచేశారు.

ఒకప్పుడు ఆక్రమణలతో ఆనవాళ్లు కోల్పోయిన బతుకమ్మ కుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని, త్వరలోనే మరో 5 చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సి) నివేదిక ప్రకారం నగరంలో ఇప్పటికే 61 శాతం చెరువులు కనుమరుగయ్యాయని, మిగిలిన 39 శాతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

**ప్రజా భాగస్వామ్యంతో అద్భుత ఫలితాలు**

ప్రభుత్వ భూములు, పార్కులు, ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలను కాపాడుకోవాలనే స్పృహ ప్రజల్లో పెరిగిందని రంగనాథ్ అన్నారు. హైడ్రా ఏర్పాటైన కేవలం 15 నెలల వ్యవధిలోనే వెయ్యి ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి కాపాడామని, దీని విలువ మార్కెట్‌లో దాదాపు రూ.60 వేల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇది ప్రజల సహకారంతోనే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా పాల్గొన్న రియర్ అడ్మిరల్ ఆర్. శ్రీనివాసరావు, మేజర్ ఎస్‌పిఎస్ ఓబెరాయ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి, అభివృద్ధి కోసం దేశాలన్నీ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఐసీసీడీఆర్ సెక్రటరీ జనరల్, అంబాసిడర్ డా. శ్రీనివాస్ ఏలూరి మాట్లాడుతూ.. దేశాల మధ్య సాంస్కృతిక, దౌత్య సంబంధాలను బలోపేతం చేయడమే తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్' అవార్డులను ప్రదానం చేశారు.

# కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలి

### - ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్

### -ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్, నీరు, టెంట్ వసతి కల్పించాలి



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) ఈ ఖరీఫ్ సీజన్లో వరి ధాన్యం, పత్తి, మక్కలు ఇతర పంటల కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగాలని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశించారు. ఆయా పంటల ఉత్పత్తుల సేకరణ, చేయాలిసిన ఏర్పాట్లు తదితర అంశాలపై పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ, ఐకెపి, మెప్మా, డీసీఎంఎస్ తదితర అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయం ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ ఏడాది ఏఏ పంటల ఉత్పత్తి ఎంత వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారిని ఇంచార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

మొత్తం జిల్లాలో 238 కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయగా, ఇప్పటివరకు 171 కొనుగోలు కేంద్రాలు ఐకెపి, పిఎసిఎస్, మెప్మా డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయని, మిగతావి వారం రోజుల్లోగా ప్రారంభిస్తారని ఆయా శాఖల అధికారులు ఇంచార్జి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వ్యవసాయ అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రెండు లక్షల 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నామని వెల్లడించారు. ఈ మేరకు అన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, టెంట్లు, నీటి వసతి విద్యుత్ వసతి పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. గన్ని సంచుల కొరతలేదని ఇంకా కావాల్సినవి తెప్పించాలని ఆదేశించారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సిసిఐ ఆధ్వర్యంలో రైతులకు కపాస్ కిసాన్ యాప్ పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మక్కల కొనుగోలు కేంద్రాల ప్రారంభమయ్యాయని ఆయా మండలాల్లో రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్, డిఆర్డిఓ శేషాద్రి, డీసీ ఎస్ ఓ చంద్ర ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, డీసీఓ రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# రామడుగు, సితయపేట్, గోవింద్పల్లి గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలు





### - ఐకెపి ఎపిఎం చిన్నయ్య చేతుల మీదుగా ప్రారంభం

ధర్పల్లి( ప్రశ్న న్యూస్)నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో రామడుగు,సితయపేట్, గోవింద్పల్లి గ్రామాలలో ఐకెపి ఎపిఎం చిన్నయ్య చేతుల మీదుగా ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళలంటే అబల కాదు సభ అని నిరూపిస్తున్నారు. మహిళల ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగింది. ప్రతి మహిళ ఎదగాలని ఆలోచన మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని దానికి అనుగుణంగా మన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశాల మేరకు రామడుగు, గోవింద పల్లి దమ్మన్నపేట, సీతయిపేట, గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రంలో ప్రారంభించామని ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం దలారులకు అమ్మి మోసపోవద్దని రైతు కొనుగోలు కేంద్రాలకు వరి నీ తాలు తప్ప లేకుండా శుద్ధి చేసుకుని కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామడుగు సెంటర్ ఇన్చార్జి శివ జ్యోతి, అధ్యక్షులు లత, విజయ వనజ, కవిత సెంటర్ ఇన్చార్జ్ శివజ్యోతి, అధ్యక్షులు లతా, విజయ, వనజ, కవిత ఐకెపి ఏ పి యం చిన్నయ్య, సేంటరి ఇంచార్జ్ అరుణ, సి ఏ అనుసూయ, అధ్యక్షుడు రాజమణి, కార్యదర్శి లక్ష్మి, స్రవంతి, ఉషశ్రీ, లావణ్య, వినోద, తదితరులు పాల్గొన్నారు

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
శనివారం 25 అక్టోబర్ 2025

# ఓలా, ఉబర్ సంస్థలకు పోటీగా కేంద్రం 'భారత్ ట్యాక్సీ'- త్వరలో సేవలు ప్రారంభం!



ప్రజా రవాణాలో రాజ్యమేలుతున్న ఓలా, ఉబర్ వంటి సంస్థలకు పోటీగా కేంద్రం భారత్ ట్యాక్సీని డ్రైవర్లకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది. దీన్ని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, నేషనల్ ఇ-గవర్నెన్స్ డివిజన్ అభివృద్ధి చేసింది. పైలట్ ప్రాజెక్ట్ కింద దిల్లీలో నవంబర్ నుంచి ఈ సేవలు ప్రారంభంకానున్నాయి. మొదట భారత్ ట్యాక్సీ ద్వారా సొంతవాహనాలు కలిగిన 650 మంది డ్రైవర్లు దేశ రాజధానిలో ఈ సేవలు అందించనున్నారు. అనంతరం ఈ సేవలు ఇతర ప్రధాన నగరాలకు విస్తరించనుంది. ప్రైవేట్ సంస్థల యాప్ ఆధారిత ట్యాక్సీ సర్వీసులపై కొన్ని ఏళ్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధరలు, క్యాన్సిలేషన్లతో పాటు తమ ఆదాయం నుంచి కంపెనీలు 25 శాతం వరకు కమీషన్ తీసుకోవడంపై చాలా మంది డ్రైవర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటికీ సమాధానంగా కేంద్రం తీసుకువస్తున్న ఈ భారత్ ట్యాక్సీలో నమోదుకు డ్రైవర్లు ఎలాంటి కమీషన్ చెల్లించాల్సిన అవసరంలేదు. మెంబర్‌షిప్ కింద స్వల్ప మొత్తం ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. అయితే ఈ సేవల ద్వారా డ్రైవర్లు తమ సంపాదనలో ఎక్కువ వాటాను నిలుపుకోవడానికి వీలు కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అదేవిధంగా 2026 మార్చి నాటికి మెట్రో నగరాల్లో ఈ భారత్ ట్యాక్సీ సేవలు అందుబాటులో తీసుకురావలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రారంభ దశలో దేశవ్యాప్తంగా దాదాపు 5000 మంది పురుష, మహిళా డ్రైవర్లను ఇందులో భాగస్వామ్యం చేయనుంది. ముంబయి, పుణే, భోపాల్, లఖ్‌నవూ, జైపూర్‌తో సహా 20 నగరాల్లో కూడా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు 2030 నాటికి సుమారు లక్షమంది డ్రైవర్లను ఈ ప్లాట్‌ఫామ్‌లో భాగం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే భారత్ టాక్సీ, ప్రైవేటు యాజమాన్యంలోని కార్పొరేషన్‌గా కాకుండా సహకార సంస్థగా పనిచేస్తుంది. ఈ సేవలను సహకార్ టాక్సీ కోఆపరేటీవ్ లిమిటెడ్ నిర్వహిస్తుంది. ఈ సహకార్ ట్యాక్సీని గతంలోనే కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించారు. సహకార సంఘాల మాదిరిగా ఇది పనిచేస్తుందని, ఇందులో నమోదు చేసుకున్న డ్రైవర్లకు మేలు చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. టూవీలర్, ఆటోలు, ఫోర్ వీలర్లు సహకార్ ట్యాక్సీలో భాగంగా సేవలందిస్తాయని ఆయన చెప్పారు. ఇందులోని లాభాలన్నీ ఏ ఒక్క కంపెనీకో పరిమితం కాకుండా డ్రైవర్లకు లబ్ధి చేకూరుతుందని మంత్రి వివరించారు. ఈ సేవను ఉపయోగించడం ఓలా, ఉబర్ యాప్‌ను ఉపయోగించినంత సులభం. ముందుగా ఆండ్రాయిడ్ వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి "భారత్ టాక్సీ" యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఐఫోన్ వినియోగదారులు ఆపిల్ స్టోర్ నుంచి దీన్ని ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇది హిందీ, ఇంగ్లీష్, గుజరాతీ, మరాఠీ భాషల్లో అందుబాటులో ఉండనుంది.

# మా సర్కార్‌లో మరికొందరు ఉపముఖ్యమంత్రులు ఉంటారు: తేజస్వి యాదవ్



బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ కీలక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వం వస్తే, మంత్రివర్గంలో ఒకరు కంటే ఎక్కువ మంది ఉపముఖ్యమంత్రులు ఉంటారని పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లోనే దీని గురించి పూర్తి వివరాలు తెలుస్తాయని ఆయన మీడియాకు తెలిపారు. అంతేకాదు, నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంపై బిహార్ ప్రజలు కోపంతో, అసంతృప్తితో ఉన్నారని, అందుకే వారు మార్పు కోరుకుంటున్నారని తేజస్వి యాదవ్ అన్నారు. ఇప్పటికే ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్‌ను మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే, కూటమిలోని వికాశ్‌షీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ ) చీఫ్ ముకేశ్ సహానీని కూటమి తరఫున ఉపముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. అయితే డిప్యూటీ సీఎంలు సహానీతో పాటు మరికొందరు ఉంటారని తేజస్వి చెప్పడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. "నీతీశ్ కుమార్ ప్రభుత్వం గత 20 ఏళ్లుగా బిహార్ ప్రజలను దోపిడీ చేస్తోంది. అందుకే బిహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. వారు ఎన్‌డీఏ ప్రభుత్వం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు."

– తేజస్వి యాదవ్, ఆర్‌జేడీ నేత, మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి

మోదీ అవుట్‌సైడర్

బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తేజస్వి యాదవ్ శుక్రవారం సహర్సాలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రధాని మోదీ లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు.

"ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసుకుని, బిహార్‌లో విజయం సాధించాలని కోరుకుంటున్నారు. కానీ ఇది జరగదు. మేము బిహారీలం. మేము 'బహారీ' (బయటి వ్యక్తుల)లకు భయపడం. బిహార్‌ను బయటి వ్యక్తులు కాదు, సొంత ప్రజలే పాలించాలి."

– తేజస్వి యాదవ్, ఆర్‌జేడీ నేత, మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి


బిహార్ ఎన్నికలకు ఇంకా రెండు వారాల సమయం ఉంది. ఇలాంటి కీలక సమయంలో మహాగఠ్‌బంధన్ కూటమి తరఫున సీఎం, డిప్యూటీ సీఎం అభ్యర్థులను ప్రకటించడం గమనార్హం. అంటే దీని ద్వారా మిగిలిన ఈకొద్ది సమయంలోనైనా తాము అంతా ఐక్యంగా ఉన్నట్లు చెప్పడానికి, ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి ఎంత వెసులుబాటు కలిగిందని చెప్పవచ్చు.


తప్పని పరిస్థితుల్లో!

ప్రస్తుతం తేజస్వీ యాదవ్ బిహార్ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. గతంలో ఉపముఖ్యమమంత్రిగా ఆయన పని చేశారు. మహాగఠ్‌బంధన్‌లో విభేదాల నేపథ్యంలో కొన్ని స్థానాల్లో ఆర్‌జేడీ, కాంగ్రెస్ పరస్పరం పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ 61 స్థానాల్లో పోటీ చేయగా, ఆర్‌జేడీ 143 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇంతకు ముందు తేజస్వి, రాహుల్ బిహార్‌లో సంయుక్తంగా ఓటర్ అధికార్ యాత్ర నిర్వహించారు. కానీ ఆ సమయంలో రాహుల్‌గానీ, కాంగ్రెస్ కానీ తేజస్వి యాదవ్‌ని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎక్కడా చెప్పలేదు. కానీ ఎన్నికలు తరుముకొస్తున్న వేళ తేజస్విని సీఎం అభ్యర్థిగా ప్రకటించారు. దీనితో తనను సీఎం అభ్యర్థిగా గుర్తించిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. తేజస్వి యాదవ్ ఎప్పటిలానే రఘోపూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. కాగా, బిహార్‌లో రెండు దశల్లో నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫలితాలు నవంబర్ 14న ప్రకటించనున్నారు.

# సోషల్ మీడియాలో కార్మికులకు జర్నలిస్ట్ బెదిరింపులు..!!





## - జర్నలిస్ట్ అక్రమాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కార్మికుడు..

జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 24: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలపరిధిలోని పడమటి నరసాపురం గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి యువసహాయ సేన. గ్రూపులో శుక్రవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఓ జర్నలిస్ట్ (పంచాయతీ) జిపి లలో పనిచేసే కార్మికులను బెదిరిస్తూ ప్రత్యేకంగా పడమటి నరసాపురం గ్రామ జిపికి సంబంధించిన కార్మికులకు బెదిరింపులతో కూడిన సోషల్ మీడియా పోస్ట్ చేసినాడు. "అదేమనగా"

పంచాయతీ జిపి లలో పనిచేసే వర్కర్ల పద్ధతి మార్చుకోవాలని అనవసరమైన విషయాలలో తల దురిస్తే ఇబ్బందులు పడతారు తస్మాత్ జాగ్రత్త గా ఉండండి. మీడియా మిత్రులతో ఎలా ఉండాలో తెలుసుకోండి? "మరి ముఖ్యంగా నర్సాపురం జిపిలో ఉండేవాళ్లు." అంటూ సోషల్ మీడియాలో బహిరంగంగానే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఇట్టి విషయమై గోపాల్ రెడ్డి యువ సహాయసేన గ్రూపులోని ఓ కార్మికుడు స్పందిస్తూ జర్నలిస్ట్ పాల్పడుతున్న అక్రమాలపై బహిరంగంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

**– అందరికీ నమస్కారం కార్మికుడి పోస్ట్..!**

అందరికీ నమస్కారం మరీ ముఖ్యంగా విలేకరిని అని చెప్పుకొని ప్రజల దగ్గర ప్రభుత్వ పథకాల సబ్సిడీలు ఇప్పిస్తామని సర్టిఫికెట్లు చేయిస్తామని చెప్పి అమాయక ప్రజల దగ్గర డబ్బుల దందాలు చేస్తున్నారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేసేవారి దగ్గర మీడియా అని చెప్పుకొని బెదిరిస్తున్నారు వాస్తవాలు తెలుసుకోకుండా డబ్బు సంపాదించడమే లక్ష్యంగా విలేకరిగా చేస్తున్నారు ఇలాంటి వారితో భయపడేది లేదు. ప్రజలను ఇబ్బంది పెడుతూ మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో కుల ఆదాయ సర్టిఫికెట్లు చేపిస్తామని ఏజెంట్ సర్టిఫికెట్లు చేయిస్తామని కళ్యాణ్ లక్ష్మి చేయిస్తామని డబ్బులు వసూలు చేస్తూ ఎక్కడెక్కడ డబ్బులు దొరికే అవకాశం ఉందో తెలుసుకొని సామాన్య ప్రజానీకాన్ని భయపెడుతున్నారు. తస్మాత్ జాగ్రత్త మీ ప్రతాపం చిన్న చిన్న ఉద్యోగాలు చేసే వారి మీద బెదిరింపులకు పాల్పడుతూ వాళ్ళు మాట వినకపోతే అనవసరంగా రాద్ధాంతాలు చేస్తూ జనాలను పక్కదారిని పట్టిస్తున్నారు చిన్న ఆఫీస్ సెంటర్ పెట్టుకొని రౌడీయిజం దందాలు చేస్తూ బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదు..

**– పంచాయతీ కార్మికుల మీద కాదు మీ పెత్తనం..!!**

పంచాయతీల్లో పనిచేసే కార్మికుల మీద కాదు మీ పెత్తనాలు, దందా గిరి చేస్తూ డబుల్ బెడ్రూం ఇప్పిస్తానని చెప్పి లక్షల డబ్బులు వసూలు చేసే వారి మీద, ప్రభుత్వ సొమ్ములను కొల్లగొట్టే వారి మీద, అమాయక గిరిజనులు మోసం చేసే వారి మీద, ఆడపిల్లలను మోసం చేసేవ వారి మీద మీ పెత్తనం. "అంతేకానీ ఏదో ప్రతిరోజుకి సుమారు ఒక 300 రూపాయలతో పనిచేస్తూ ఉదయమే బయలుదేరి సాయంత్రం కాలం వీళ్ళ వరకు అన్ని రకాల పనులు చేస్తూ సెక్రటరీ కి సహకరిస్తూ పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న వారి మీద దందాగిరులు. చేయకూడదు విలేకరైనంత మాత్రాన ముఖ్య మంత్రిలా ఫీల్ అవ్వాల్సిన అవసరం లేదు పిచ్చి పిచ్చి వేషాలు చేయడం మానుకోవాలి ముందే చెప్తున్నా అంటూ ఓ జర్నలిస్ట్ లిస్ట్ కు సమాధానంతో పోస్ట్ చేసిన కార్మికుడు.

# దీపావళి, ఛఠ్‌పూజకు వచ్చిన వలస కార్మికులను పోలింగ్ దాకా ఆపేదెలా? బిహార్‌లో పార్టీల మల్లగుల్లాలు!





దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ లక్షలాది మంది బిహారీ వలస కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో చాలామంది దీపావళి, ఛఠ్ పండుగల కోసం బిహార్‌కు వచ్చేశారు. అక్టోబరు 25 నుంచి 28 వరకు ఛఠ్ పూజలు జరుగుతాయి. ఈ పండుగ ముగిసిన 9 రోజుల తర్వాత (నవంబరు 6న) అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్, 14రోజుల తర్వాత (నవంబరు 11న) రెండో విడత పోలింగ్ జరగనున్నాయి. విదేశాల నుంచి వచ్చే బిహారీ వలస కార్మికులైతే ఎక్కువగా నెల రోజుల పాటు ఇళ్లలో ఉంటారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారు మాత్రం ఛఠ్ పండుగ ముగిసిన వెంటనే వారి ఉద్యోగాలు, పనులను వెళ్లిపోయేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ తేదీల వరకు బిహారీ వలస కార్మికులను రాష్ట్రంలోనే ఆపడం సవాల్‌గా మారింది. దీంతో వారిని పోలింగ్ వరకు ఆపేది ఎలా? అనే దానిపై రాజకీయ పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. ఛఠ్ పండుగను బిహారీలు ఘనంగా జరుపుకొంటారు. బిహారీ వలస కార్మికులు దేశంలో, ప్రపంచంలో ఎక్కడున్నా ఈ పండుగ వేళ ఇళ్లలో వాలిపోతారు. నాలుగు రోజుల ఛఠ్ పూజల్లో భక్తిభావంతో పాల్గొంటారు. ఈసారి ఛఠ్ పండుగ ఎన్నికల సమయంలో వచ్చింది. ఈ ఫెస్టివల్ ముగిసిన 9 రోజుల్లోనే తొలి విడత పోలింగ్ జరుగుతుంది. ఈ క్రమంలో పండగకు పోలింగ్‌కు చాలా రోజుల గ్యాప్ ఉంటుంది. బిహారీ వలస కార్మికుల్లో చాలామంది ప్రైవేటు రంగంలోనే పనిచేస్తున్నారు. అతికొద్ది మంది మాత్రమే ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. అక్టోబరు 20న దీపావళి పండుగ జరిగింది. అక్టోబరు 28న ఛఠ్ పండుగ పూజలు ముగుస్తాయి. దీపావళి నుంచి ఛఠ్ పండుగ వరకు సగటున 10 రోజుల సెలవులు తీసుకొని బిహారీ వలస కార్మికులు స్వరాష్ట్రానికి వచ్చారు. అలాంటప్పుడు అక్టోబరు 28 తర్వాత కూడా వారంతా బిహార్‌లోనే ఉండే అవకాశాలు తక్కువనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తొలి విడత పోలింగ్ తేదీ (నవంబరు 6) వరకు బిహారీ వలస కార్మికులకు సెలవులను కంపెనీలు పొడిగించే అవకాశాలు దాదాపుగా లేవు. ఇక రెండో విడత పోలింగ్ జరిగే సమయానికి (నవంబరు 11) వారు రాష్ట్రం నుంచి పూర్తిగా వెళ్లిపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఈ అంశాలే ఇప్పుడు అధికార, విపక్ష కూటముల్లోని రాజకీయ పార్టీలను కలవరానికి గురి చేస్తున్నాయి. వలస కార్మికుల పోలింగ్ శాతంలో ఏ మాత్రం తేడా వచ్చినా, ఎన్నికల ఫలితం మారిపోతుందనే ఆందోళన అభ్యర్థులను వెంటాడుతోంది. దీంతో పోలింగ్ తేదీల వరకు ఎలాగైనా ఓటర్లను రాష్ట్రంలోనే నిలిపి ఉంచేందుకు వారు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి మరీ బిహారీ వలస కార్మికులను కలుస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లో దాదాపు 48 లక్షల మంది బిహారీ వలస కార్మికులు ఉన్నారనేది కేంద్ర ప్రభుత్వ అంచనా. వీరిలో దాదాపు 45 లక్షల మంది వివిధ రాష్ట్రాల్లో ఉండగా, మిగతా 2.50 లక్షల మంది విదేశాల్లో ఉన్నారు. కానీ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) గణాంకాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఓట్లు కలిగిన బిహారీ వలస కార్మికుల సంఖ్య 21.30 లక్షలేనని ఈసీ చెబుతోంది.

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను ఈసీ నిర్వహించిన సమయంలో వలస కార్మికుల వివరాలను చాలా కుటుంబాలు కచ్చితంగా అందించలేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఓటుహక్కును నిలుపుకోవడానికి తమ వాళ్లు రాష్ట్రంలోనే పని చేస్తున్నారని ఎక్కువ కుటుంబాలు చెప్పాయన్నారు. చాలా ఫ్యామిలీలు ఉద్దేశపూర్వకంగానే తమ ఇంట్లోని వలస కార్మికుల వివరాలను ఇవ్వలేదని పేర్కొన్నారు. దీనివల్లే ఎన్నికల సంఘం, కేంద్ర సర్కారు గణాంకాల్లో భారీ వ్యత్యాసం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లోనే కొంత వాస్తవికత కనిపిస్తోందన్నారు.

"బిహారీ వలస కార్మికులు రాజకీయ పార్టీలకు చాలా ముఖ్యం. అందుకే వారిని పోలింగ్ తేదీల వరకు రాష్ట్రంలో నిలిపే ప్రయత్నాలను రాజకీయ పార్టీలు చేస్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేక ప్రచారాలు నిర్వహిస్తున్నాయి. ఇంటింటికి వెళ్లి మరీ కార్మికులను అభ్యర్థులు కలుస్తున్నారు. ఎన్నికల సంఘం చెబుతున్న దాని కంటే పెద్దసంఖ్యలో రాష్ట్రంలో వలస కార్మిక ఓటర్లు ఉన్నారు. వీరిలో చాలామంది ఛఠ్ పండుగ సెలవులు ముగియగానే ఉద్యోగాలకు వెళ్లిపోతారు. వారిని ఎంతమేరకు రాజకీయ పార్టీలు ఆపగలుగుతాయో వేచిచూడాలి"

బిహార్‌లోని పశ్చిమ చంపారన్, పూర్ణియా, కతిహార్, అరారియా వంటి సరిహద్దు జిల్లాల నుంచే ఎక్కువ మంది ఓటర్లు వలస కార్మికులుగా పనిచేస్తున్నారు. సాక్షాత్తూ ఎన్నికల సంఘమే ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ జిల్లాల్లోని ఒక్కో అసెంబ్లీ స్థానంలో దాదాపు 10వేల నుంచి 17వేల మంది ఓటర్లు ఉపాధి కోసం వలస వెళ్లారు. ఈ కీలకమైన జిల్లాల్లో తొలి విడతలోనే పోలింగ్ జరగనుంది. పోలింగ్ జరగనున్న నవంబరు 6వ తేదీ వరకు బిహారీ వలస కార్మికుల్లో చాలామంది ఉద్యోగాలకు వెళ్లిపోతే, ఈ అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికల ఫలితాలు మారిపోతాయి. అభ్యర్థుల బలాబలాల్లోనూ గణనీయమైన మార్పు వస్తుంది. పోలింగ్ శాతం సైతం తగ్గిపోతుంది.

2020లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సగటున 57 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి తొలివిడత పోలింగ్ రోజున బిహారీ వలస కార్మికులు అందుబాటులో లేకుంటే, పోలింగ్ శాతం 5 నుంచి 7 శాతం తగ్గుతుందనే అంచనాలు వెలువడుతున్నాయి. దీపావళి, ఛఠ్ పండుగల కోసం సెలవుపై స్వరాష్ట్రానికి వచ్చిన వలస కార్మికుల్లో 60 శాతం మంది తొలి విడత పోలింగ్ (నవంబరు 6) సమయానికే వెళ్లిపోవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రెండో విడత పోలింగ్ (నవంబరు 11) సమయానికి వలస కార్మికుల్లో 80 శాతం మంది ఉద్యోగాల కోసం వెళ్లిపోయే అవకాశం ఉందని అంటున్నారు.

"నేను వలస కార్మికులను కలుస్తున్నాను. పోలింగ్ తేదీ వరకు రాష్ట్రంలోనే ఉండమని వాళ్లకు రిక్వెస్ట్ చేస్తున్నాను. వారు తప్పకుండా నా మాట వింటారని భావిస్తున్నాను. వలస కార్మికులు సహకరిస్తే మేం రాష్ట్రం భవిష్యత్తును మారుస్తాం. స్థానికంగానే ఉపాధి అవకాశాలను క్రియేట్ చేస్తాం" అని పట్నాలోని బంకిపూర్ అభ్యర్థి, బీజేపీ ఎమ్మెల్యే నితిన్ నవీన్ తెలిపారు.

వలస కార్మికులను కలుస్తున్నాం

"ఛఠ్ పండుగ కోసం వచ్చిన వలస కార్మికులను మేం కలుస్తున్నాం. పోలింగ్ వరకు రాష్ట్రంలోనే ఉండమని కోరుతున్నాం. ఇంటింటికి వెళ్లి మరీ ఈ అంశంపై ప్రచారం చేస్తున్నాం. వలస కార్మికులు మమ్మల్ని అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం" అని బిహార్‌లోని ముజఫర్‌పూర్‌కు చెందిన జేడీయూ నాయకుడు ఇర్షాద్ హుస్సేన్ గుడ్డు తెలిపారు.

బిహార్‌లోని ముజఫర్‌పూర్ చెందిన సంతోష్ కుమార్ దిల్లీలో పనిచేస్తున్నారు. ఆయన ఛఠ్ పండుగ కోసం రాష్ట్రానికి వచ్చారు. ఓటు వేసి పనికి వెళ్తానని సంతోష్ అంటున్నారు.

బిహార్‌కు చెందిన శాంతన్ మాంఝీ ముంబయిలోని ఓ స్టీల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. ఓటు వేశాకే పనికి వెళ్తానని ఆయన తెలిపారు.

బిహార్‌లోని అర్రా అసెంబ్లీ స్థానానికి చెందిన సైనికుడు విక్రాంత్ గుప్తా ఓటు వేయడానికి తన సెలవును పోలింగ్ తేదీ వరకు పొడిగించుకున్నారు.

బిహార్‌లోని అర్రా అసెంబ్లీ స్థానానికి చెందిన రీతు కుమారి బెంగళూరులో ఉంటారు.

# టిల్లు బాబు క్యూబ్ తో కొట్టే వరకూ కొత్తవి ఉండవా?



టిల్లు బాబు క్యూబ్ తో కొట్టే వరకూ కొత్తవి ఉండవా? యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డ %-%డీజేటిల్లు%-%తో ఏ రేంజ్ లో ఫేమస్ అయ్యాడో తెలిసిందే. యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డ %-%డీజేటిల్లు%-%తో ఏ రేంజ్ లో ఫేమస్ అయ్యాడో తెలిసిందే. అప్పటి వరకూ ఎన్నో సినిమాలు చేసినా? ఏ సినిమా ఇవ్వని గుర్తింపును %-%డీజేటిల్లు%-% ఇచ్చింది. ఒక్క విజయం యువతలో భారీ ఫాలోయింగ్ తెచ్చి పెట్టింది. అటుపై %-%టిల్లు స్క్వేర్%-% తో మరో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. దీంతో సిద్దు క్రేజ్ మరింత రెట్టింపు అయింది. ఆ వేంటనే %-%జాక్%-% అంటూ మరో చిత్రంతో వచ్చాడు. కానీ ఈ సినిమా ఆశించిన స్థాయిలో రాణించలేదు. అయినా ఆ పరాజయం సిద్దం వేగం ముందు కనిపించలేదు. పెద్దగా హైలైట్ కాలేదు. %ూశ్రీంశీ =ఖుం% - స్పిరిట్ లో కొరియన్ యాక్టర్.. ఉన్నాడా? లేడా? తాజాగా %-%తెలుసు కదా%-% అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమా డివైడ్ టాక్ తో ఆడుతోంది. మంచి కంటెంట్ ఉన్న సినిమా అని ఓ సెక్షన్ ఆడియన్స్ మాట్లాడుకుంటున్నా? ప్రేక్షకుల్లో కన్ఫ్యూజ్ అవుతున్నారనే విమర్శలున్నాయి. కొన్ని ఏరియాల్లో సినిమా ఇప్పటికే బ్రేక్ ఈవెన్ కూడా అయింది. మరి ఈ సినిమా లాంగ్ రన్ లో ఎలాంటి ఫలితాలు సాధిస్తుందో చూడాలి. ఏదీ ఏమైనా సిద్దులో మునుపటి వేగం కనిపించలేదు. ఇప్పుడున్న వేగం సరిపోదు అసలే కాంపిటీషన్ ఎక్కువగా ఉంది. - సుశాంత్ సింగ్ కేసులో రియా చక్రవర్తిపై సీబీఐ నివేదిక రహస్యం! కొత్త తారలు దూసుకొస్తున్న తరుణంలో వైఫల్యాలు అన్నవి? వెనక్కి నెట్టే అవకాశం ఉంది. మరి ఈ సిచ్వేషన్ దాటుకుని ఎలా ముందుకు సాగుతాడు? అన్నది చూడాలి.

# హీరోయిన్స్‌ని పెళ్లి చేసుకోవడానికి ఎవరూ ఇష్టపడరు

సినిమా ఇండస్ట్రీలోకి హీరోయిన్‌గా అడుగుపెట్టాలని ఎవరైనా అనుకుంటే

## - కృతి సనన్

ఇప్పటికి కూడా చాలా ఆశ్చర్యంగా చూస్తూ ఉంటారు. ఇండస్ట్రీలోకి వెళ్తే అమ్మాయిలు చెడిపోతారు అనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. అందుకే తమ కూతుళ్ళని హీరోయిన్స్ చేయడానికి ఇష్టపడరు.

ఈ భావన రెండు దశాబ్దాల క్రితం అయితే బలంగా ఉండేది. అందుకే తెలుగు అమ్మాయిలు ఎవరూ హీరోయిన్స్ కాలేకపోయారు. అయితే ఇప్పుడిప్పుడే నటన అనేది ఒక వృత్తి అని నటిగా రాణించడం అనేది వృత్తిలో భాగం అని భావిస్తున్నారు.

అయితే ఇప్పటికే సమాజంలో చాలా ప్రాంతాలలో సినిమా ఇండస్ట్రీలో ఉన్న నటీమణుల మీద అలాంటి అభిప్రాయాలు ఉన్నాయని చెప్పాలి. ఇదే విషయాన్ని కృతి సనన్ కూడా ఓ ఇంటర్వ్యూలో పేర్కొంది. సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్స్ కి అంత వేగంగా పెళ్ళిళ్ళు కావు అనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. నిజానికి చాలా మంది హీరోయిన్స్ ని పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడరు కూడా. దీనికి కారణం హీరోయిన్ అనేది ఒక ఉద్యోగం అనే విషయాన్ని చాలా మంది ఇప్పటికి అంగీకరించలేరు.

అలాగే సినిమా ఇండస్ట్రీలో నటిగా పని చేయడం ఒక వృత్తిగా చూడరు. ఈ కారణంగానే హీరోయిన్స్ ని పెళ్లి కావడం కష్టం. సినిమా ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో చాలా మంది తనని కూడా ఇలాగే భయపెట్టారు.

అయితే ఆ విషయాలని తాను సీరియస్‌గా తీసుకోలేదు. ఇష్టపడిన వృత్తిలో సక్సెస్ కావాలని భావించి హీరోయిఁ గా కెరియర్ స్టార్ట్ చేశాను అని పేర్కొంది. సమాజంలో ఈ వృత్తి పట్ల ఎలాంటి అపోహలు ఉన్నా కూడా పట్టించుకొను అంటూ తేల్చేసింది. ఇదిలా ఉంటే ఈ అమ్మడు సీతగా నటించిన ఆదిపురుష్ మూవీ రిలీజ్ కి రెడీ అవుతుంది.

ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. మరో వైపు హిందీలో షాహిద్ కపూర్ కి జోడీగా ఒక సినిమాలో నటిస్తుంది. అలాగే టైగర్ ష్రాఫ్ తో గణపత్ అనే సినిమాలో నటిస్తుంది. వీరిద్దరి కాంబోలో ఇది రెండో సినిమా అలాగే ది క్రూ అనే సినిమాలో కూడా ఆమె నటిస్తుంది. కృతితో పాటు మరో ముగ్గురు హీరోయిన్స్ ఈ సినిమాలో నటిస్తుంది. మరి కొన్ని ప్రాజెక్ట్స్ కూడా చర్చల దశలో ఉన్నాయని చెప్పాలి.

# సైడ్ యాంగిల్‌లో ముద్దుగుమ్మ ఎద అందాలు



ఆకతాయి సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్ గా సరైన సక్సెస్ లను సొంతం చేసుకోవడంలో విఫలమయ్యింది కానీ అందాల ఆరబోతతో సోషల్ మీడియాలో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. హీరోయిన్ గా కంటే కూడా ఈ అమ్మడి అందాల ఆరబోత కారణంగా ఎక్కువ పాపులారిటీ లభించింది.

గత ఏడాది అశోక వనంలో అర్జున కళ్యాణం సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రుక్సార్ ధిల్లాన్ ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తోంది. తెలుగులో కూడా ఒకటి రెండు సినిమాల్లో నటించేందుకు గాను చర్చలు జరుపుతున్నట్లుగా తెలుస్తోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సైడ్ యాంగిల్‌లో ఎద అందాలను చూపిస్తూ కుర్రకారు మతి పోగొడుతున్న రుక్సార్ ధిల్లాన్ ఫొటోలు తెగ షేర్ చేస్తూ ఉన్నారు. ఆకట్టుకునే ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అంతే కాకుండా ఈ అమ్మడి యొక్క హాట్ లుక్ కు ఎంతటి వారైనా ఫిదా అవ్వాల్సిందే అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్నా పాపం అదృష్టం కలిసి రాకపోవడంతో ఎక్కువగా ఆఫర్లు సొంతం చేసుకోలేక పోతుంది. ఇదే రేంజ్ లో అందాల విందు చేస్తే ముందు ముందు అయినా ఈ అమ్మడికి వరుసగా ఆఫర్లు వస్తాయేమో చూడాలి.

# ఉపాసన 'డబుల్' సెలబ్రేషన్స్.. అల్లు వారంతా ఎక్కడ?



ఉపాసన 'డబుల్' సెలబ్రేషన్స్.. అల్లు వారంతా ఎక్కడ? ఉపాసన సీమంతం వేడుక ఎంతో ఘనంగా జరగ్గా.. మెగా కుటుంబసభ్యులతో పాటు టాలీవుడ్ సినీ ప్రముఖులు కూడా సందడి చేశారు. మెగా స్టార్ కపుల్ రామ్ చరణ్-ఉపాసన దంపతులు మరోసారి తల్లిదండ్రులు కాబోతున్న విషయం తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో దీపావళి సెలబ్రేషన్స్ తో పాటు ఉపాసన సీమంతం వేడుకలు ఇటీవల నిర్వహించారు. ఆ వీడియోను ఉపాసన ఇటీవల షేర్ చేస్తూ డబుల్ ప్రేమ, డబుల్ బ్లెస్సింగ్స్, డబుల్ సెలబ్రేషన్స్ అంటూ క్యాప్షన్ పెట్టారు. ఉపాసన సీమంతం వేడుక ఎంతో ఘనంగా జరగ్గా.. మెగా కుటుంబసభ్యులతో పాటు టాలీవుడ్ సినీ ప్రముఖులు కూడా సందడి చేశారు. హీరో వెంకటేష్ తన సతీమణితో హాజరవ్వగా.. మరో హీరో నాగార్జున కూడా తన ఫ్యామిలీతో వచ్చారు. వీరితో పాటు కోలీవుడ్ హీరోయిన్ నయనతార తన భర్త, పిల్లలతో కలిసి హాజరై సందడి చేశారు. %ూశ్రీంశీ =ఖుం% - బిగ్ బాస్ 9.. వాళ్ల ఎంట్రీతో హౌస్ మెట్స్ షాక్..! మెగా ఫ్యామిలీ నుంచి వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి, నాగబాబు, వైష్ణవ్ తేజ్, పవన్ సతీమణి అన్నా లెజనోవా సహా పలువురు అటెండ్ అయ్యారు. కానీ అల్లు కుటుంబం నుంచి కూడా ఒక్కరు కూడా కనిపించలేదు. అల్లు అరవింద్, ఆయన సతీమణి, కుమారులు, కోడళ్ళు, మనవలు, మనవరాళ్లల్లో ఒక్కరూ ఉపాసన బేబీ షవర్ గ్లింప్స్ లో లేరు. దీంతో మళ్లీ ఏం జరిగిందోనని కొందరు సినీ ప్రియులు, నెటిజన్లు డిస్కస్ చేసుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం రెండు కుటుంబాల మధ్య వైరం ఉందని వార్తలు వచ్చినా.. ఆ తర్వాత తమ మధ్య ఎలాంటి ఇబ్బందులు లేవని పరోక్షంగా చాటిచెప్పారు. కానీ ఇప్పుడు ఉపాసన బేబీ షవర్ వీడియోలో ఒక్క అల్లు ఫ్యామిలీ మెంబర్ లేకపోవడంతో హాట్ టాపిక్ గా మారింది.



# రెడ్ హాట్‌లో కాజోల్ డాటర్ దుమారం!





బాలీవుడ్ లో వారసురాళ్ల ఎంట్రీ జోరుగా సాగుతోన్న సంగతి తెలిసిందే. వారసులు కెరీర్ పరంగా కాస్త డైలమాలో ఉన్నా..స్వీట్ డాటర్స్ మాత్రం మేమున్నామంటూ ముందుకొస్తున్నారు. తల్లిదండ్రుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని మ్యాకప్ వేసుకుంటారు. తాజాగా అజయ్ దేవగణ్-కాజోల్ దంపతుల దంపతుల కుమార్తె నైసా దేవగణ్ కూడా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది.ఈ నేపథ్యంలో నైసా ఎంట్రీ ఎప్పుడైనా జరిగే అవకాశం ఉందని చెప్పొచ్చు. అయితే అంతకు ముందే బ్యూటీ సోషల్ మీడియాలో క్రేజీ బ్యూటీగా వెలిగిపోతుంది. డిజైనర్ దుస్తుల్లో అందమే అసూయ పడేంత అందంతో కుర్రాళ్లను ఆకట్టుకుంటుంది. ఈ బ్యూటీ తరుచూ సెలబ్రిటీ ఫ్రెండ్స్తో కలిసి లండన్ నుండి పార్టీ దుస్తుల్లో కనిపిస్తుంటుంది. బ్లాక్ డ్రెస్ కోడ్ లో అమ్మడు మత్తెక్కించే అందాలతో కుర్రాళ్లను ఫిదా చేస్తుంటుంది.తాజాగా నైసా ఫోటో షూట్ కోసం ఇచ్చిన ఫోజులు నెట్టింట మరోసారి వైరల్ అవుతున్నాయి. ఫ్యాషన్ ఫోటోషూట్ కోసం సాంప్రదాయ దుస్తులలో పోజులిచ్చింది. ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ అనితా డోంగ్రే డిజైన్ చేసిన ఎరుపు రంగు లెహెంగాలో మిరుమిట్లు గొలుపుతోంది. వివిధ భంగిమల్లో నైసా ఫోజులు యూత్ ని మరింత ఆకర్షిస్తున్నాయి. డిజైనర్ లో క్లీవేజ్ అందాలు అంతే హైలైట్ అవుతున్నాయి.నైసా ఫోటోషూట్ లో పాల్గొనడం తొలిసారి. ఇంతకుముందెప్పుడు ఇలాంటి డిజైనర్ లో కనిపించలేదు. దీంతో నైసా బాలీవుడ్ ఎంట్రీ లో భాగంగానే టెస్ట్ షూట్ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

అన్నట్లు బాలీవుడ్ భామలంతా టాలీవుడ్ పైనా దృష్టి పెడుతోన్న సంగతి తెలిసిందే. అందులోనూ కుర్రభామలంతా తెలుగు హీరోలతో కలిసి పనిచేయాలని ఉత్సాహం చూపిస్తున్నారు. మరి నైసా దేవగణ్ కి అలాంటి అవకాశం ఏదైనా వస్తే ఇటొస్తుందా? అన్నది చూడాలి.

# నిర్లక్ష్యం చేస్తే.. వెన్నుపోటే



**వెన్నునొప్పి.. ఆధునిక జీవనశైలితో అవినాభావ సంబంధం కలిగి ఉన్నది. ఈ నొప్పి.. ఒకచోట తీరికగా కూర్చోనివ్వదు. నిమ్మళంగా నిలబడనివ్వదు కూడా. ప్రశాంతంగా పడుకోనివ్వదు. వెన్నులో వణుకు పుట్టిస్తుంది. దానిని ఢీకొట్టే ప్రయత్నం చేయకుండా భయపడితే మాత్రం వెన్నుకు పోటు తప్పదు. సున్నితమైన.. బాధాకరమైన వెన్నునొప్పి ఎందుకొస్తుంది? లక్షణాలేంటి? చికిత్స ఏంటి? తెలుసుకుందాం. వెన్నునొప్పి అనగానే ఏం చేస్తాం? సమయం లేకనో.. సమస్య చిన్నదేగా అనే ఉద్దేశంతోనో వెన్నునొప్పి సమస్యను సీరియస్‌గా తీసుకోం. ఉపశమనం కోసం పెయిన్ కిల్లర్ టాబ్లెట్స్, పెయిన్ రిలీవింగ్ ఆయింట్‌మెంట్స్ వాడుతుంటాం. కానీ కొందరిని ఇది దీర్ఘకాలికంగా వేధిస్తుంటుంది. అలర్ట్‌గా ఉంటే దీనికి శాశ్వత పరిష్కారం చూపించవచ్చు.**

### ఎందుకు వస్తుంది?

ఉరుకులు పరుగులతో సాగే ఆధునిక జీవితంలో చాలామందికి వెన్నునొప్పి సమస్య ఎదురవుతున్నది. వీపు దిగువ భాగంలో కండరాలు విపరీతంగా అలసిపోవడంతో వెన్ను నొప్పి మొదలవుతుంది. వీపు కింది భాగంలో ఉండే అనేక కండరాలు.. లిగమెంట్స్ వెన్నుపూసలకు అతుక్కొని ఉంటాయి. ఇవి మొత్తం వెన్నుని వీపు మధ్యలో నిలబెడుతాయి. కూర్చున్నప్పుడు.. నిలబడ్డప్పుడు.. పనిలో ఉన్నప్పుడు ఆ కండరాలు విపరీతంగా సాగుతాయి.

### అస్థిరతే కారణమా?

కొంతమందిలో స్థిరపడిన అలవాట్ల కారణంగా చిన్న వయసు నుంచే ఈ కండరాల పైన నిరంతరం ఒత్తిడి కలుగుతుంది. శ్రమతో కూడిన పనిచేయడం వల్ల సాగిన కండరాలు బాగా అలసిపోతాయి. బలహీనపడతాయి కూడా. దీనివల్ల వెన్ను సరైన ప్రదేశంలో నిలిపి ఉండలేదు. ఇక వెన్ను కొంత అస్థిరపడి నొప్పి మొదలవుతుంది. వెన్ను అస్థిరత వల్ల నాడులపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడి వీపు నుంచి వివిధ శరీర భాగాలకు నొప్పి వ్యాపిస్తుంది. వయసు పెరుగుతున్నాకొద్దీ వెన్నుపూసల మధ్య ఉండే డిస్క్‌లోని కార్టిలేజ్ పలుచబడుతుంది. ఫలితంగా బలహీనంగా.. పెళుసుగా మారి వెన్ను నుంచి బయటకు వచ్చే నాడులకు ఒత్తిడి ఎక్కువై వెన్ను నొప్పి వస్తుంది.

### ఎలా వ్యాపిస్తుంది?

వీపు కింది భాగం నుంచి ప్రారంభమైన నొప్పి తొడమీదుగా శరీరమంతటా వ్యాపిస్తుంది. దీనిని సయాటిక అంటారు. శరీరంలో పొడవైన నాడీ అయిన ఈ సయాటిక ఏ కొద్దిమాత్రం దెబ్బతిన్నా ఆ నొప్పి అన్ని శరీర భాగాల్లోనూ ఉంటుంది. కొందరిలో ఇది తీవ్రమైందిగా మారి రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తుంది. ప్రధానంగా వెన్నులోని లోయర్ లంబార్.. లంబోసాక్రల్ నాడులు.. వీపు దిగువన వెన్ను నాళం ఇరుకుగా మారుతాయి. వెన్నుపూసల మధ్య పలుచని పరుపులా ఉండే డిస్క్‌లో పగుళ్లు వస్తాయి. వెన్నుపూస తన ముందున్న దానిపైకి దూరి వీపు-పిరుదుల ప్రాంతంలోని కండరాలు ఒక్కసారి విపరీతంగా చలిస్తాయి.

ఎలా నిర్ధారిస్తారు?

వెన్నునొప్పితో బాధపడుతున్న వ్యక్తులు చెప్పిన లక్షణాలు, ఫిజికల్ ఎగ్జామినేషన్ తోపాటుగా మరికొన్ని పరీక్షలు జరిపించటం ద్వారా వెన్ను నొప్పిని నిర్ధారిస్తాం. వ్యాధిగ్రస్థులతో మాట్లాడటం ద్వారా నొప్పి ఎప్పుడు.. ఏవిధంగా ప్రారంభమయ్యింది? దేనివల్ల ప్రేరేపితం అయ్యింది? అని గుర్తించవచ్చు. ఇందుకోసం సాధారణ పెథొలాజికల్ పరీక్షలు చేస్తారు. అంటే రక్తం, మూత్రం పరీక్షలతోపాటు ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ చేస్తారు.

### చికిత్స ఏంటి?

నొప్పి తీవ్రత, వ్యాధిగ్రస్థుల ఆరోగ్య చరిత్ర ఆధారంగా చికిత్స నిర్ణయిస్తారు. చాలామందిలో అయిదారు వారాలు మందులు వాడటం.. వ్యాయామం ఇతర సూచనలను పాటించటం వల్ల వెన్నునొప్పి తగ్గుతుంది. అయితే కొంత మందిలో మాత్రం ఉపశమనం లభించదు. అటువంటి వారికి శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఆరు నుంచి పన్నెండు వారాల తరువాత కూడా నొప్పి తీవ్రత చాలా ఎక్కువగా ఉంటే శస్త్రచికిత్స అవసరమవుతుంది. లామినెక్టమీ, మైక్రోడిసెక్టమీ శస్త్ర చికిత్సలు నొప్పినుంచి ఉపశమనం కలిగిస్తాయి.

### ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

- ఒకసారి వెన్ను నొప్పి వచ్చి చికిత్స తీసుకుని కోలుకున్న తరువాత కూర్చోవటం, పడుకోవటం, వంగి వస్తువులు అందుకోవటం, బరువులు ఎత్తటానికి సంబంధించి ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వెన్నునొప్పి రాక ముందటిలా ప్రవర్తించటం వల్ల మళ్లీ నొప్పి రావటానికే కాకుండా వెన్నుకండరాలకు, వెన్నుకు తీవ్రమైన నష్టం కలిగించే ప్రమాదం ఉంటుంది.
- వీపు ప్రాంతానికి విశ్రాంతిని ఇవ్వటం ద్వారా వెన్నునొప్పి నుంచి కొంత ఉపశమనం కలిగించవచ్చని ఇదివరలో పడుకొని ఉండాల్సిందిగా డాక్టర్లు సూచించే వారు.
- కానీ ఇప్పుడు ఒకటి రెండు రోజులకు మించి అలా పడుకుని విశ్రాంతి తీసుకోవటాన్ని ఎవరూ సిఫార్సు చేయడం లేదు కాబట్టి దీని గురించి ఆలోచించాలి.

### లక్షణాలు

- మెడ కింది భాగం నుంచి వెన్నుచివరన ఉండే టెయిల్ బోన్ దాకా వెన్ను వెంట బిగుసుకుపోవడం వల్ల భరించలేని నొప్పి వస్తుంది.
- మెడలో.. వీపు పైభాగంలో.. వీపు కింది భాగంలో చాలా నొప్పిగా ఉంటుంది. ఏదైనా బరువు ఎత్తినపుడు శ్రమతో కూడిన పనులు చేసినపుడు నొప్పి మరింత ఎక్కువవుతుంది.
- ఎక్కువ సేపు కూర్చున్నా.. నిలబడ్డా వీపు మధ్య
- కింది భాగాల్లో నొప్పి కలుగుతుంది.
- నొప్పి వీపు కింది భాగం నుంచి పిరుదులు, తొడలు, పిక్కలు, వేళ్ల వరకూ వ్యాపించి ఉంటుంది.
- నిలబడినపుడు వీపు కింది భాగంలో విపరీతమైన నొప్పి కలిగి కండరాలు గట్టిగా కదులుతాయి.
- రాత్రిళ్లు వచ్చే వెన్ను నొప్పిలో పైకి కనిపించే లక్షణాలు రోజంతా ఉండే వెన్నునొప్పిలాగానే కనిపించినా కారణం మాత్రం భిన్నమైంది. వెన్నులో కురుపు ఏర్పడటానికి ఇది సూచిక కావచ్చు.
- ఈ గడ్డ చిన్నదిగా ఉండి వెన్ను నుంచి ప్రారంభమయ్యే నాడులను ప్రేరేపిస్తుంది.
- వెన్ను పూసలలో దేనికైనా ఇన్ఫెక్షన్ సోకటం వల్ల కూడా రాత్రుళ్లలో తీవ్ర నొప్పి ఏర్పడుతుంది.




### ఈ నొప్పితో వేరే సమస్యలు

-చేతులు, కాళ్లు, గజ్జల్లో తిమ్మిర్లు ఏర్పడుతాయి. పొడిచినట్లు అనిపిస్తుంది.

-నడుము దగ్గరనుంచి ముందుకు వంగినప్పుడు, దగ్గినపుడు నొప్పి ఎక్కువ అవుతుంటుంది. దీనిని హెర్నియేటెడే డిస్క్ అంటారు.

-జ్వరం, మూత్ర విసర్జన సమయంలో మంట ఉండి తరచూ మూత్రానికి వెళ్ల వలసి వస్తుంది. ఇన్ఫెక్షన్ వల్ల ఇలా జరుగుతుంది.

-వెన్ను నొప్పి కాలు వెనుకభాగం మీదుగా కిందికి వ్యాపిస్తుంది. దీనిని సయాటికాగా గుర్తించాలి.



# సైనసైటిస్‌కు స్వస్తి

**వాన చినుకులకు కొందరు మురిసిపోతారు. కానీ మరికొందరు భయపడతారు. వర్షంలో తడిస్తే ఆరోగ్య సమస్యలు ఎక్కడ వస్తాయోనని వారి బాధ. చలికి.. చల్లగాలికి.. వర్షానికి అలా వేధించే సమస్యే సైనసైటిస్. చూడడానికి చిన్న సమస్యగానే కనిపించినా ఇది ప్రమాదకరమైంది. దీనినెలా గుర్తించాలి? చికిత్స ఏంటి? తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? తెలుసుకొని సైనస్‌కు స్వస్తి పలుకుదాం.ఆధునిక జీవనశైలి సైనసైటిస్ సమస్యను తీవ్రతరం చేస్తున్నది. ప్రతి పదిమందిలో ఐదుగురు సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి లోపించడం కూడా దీనికి కారణం అవుతున్నది. వాతావరణంలో మార్పులు వస్తే కొందరు ఎక్కడ తమకు సైనసైటిస్ సమస్య వస్తుందేమోనని భయపడుతున్నారని చెప్తున్నారు సౌత్ కొరియాలోని యూనివర్సిటీ ఆఫ్ ఉల్సాన్ నిపుణులు. జీవనశైలి మార్చుకుంటే ఈ సమస్యను ప్రారంభంలోనే అధిగమించవచ్చు అని చెప్తున్నారు.**



సైనసైటిస్ అంటే?: కపాలంలో గాలితో నిండిన కుహరాన్ని సైనస్ అంటారు. మ్యూకస్ మెంబ్రేన్ అనే మెత్తటి పొరతో సైనస్ కప్పబడి పలుచటి ద్రవపదార్థాన్ని తయారుచేస్తుంది. ఇది మనం ఊపిరి పీల్చినప్పుడు శరీరంలోకి ప్రవేశించిన గాలికి సరైన ఉష్ణోగ్రత, తేమ కల్పిస్తుంది. కపాలంలోని ఎముకల్లో గాలి ఉండడం వల్ల వాటి బరువు తగ్గించడంలో క్రియాశీలకంగా పనిచేస్తుంది. అంతేకాదు.. మనం మాట్లాడినప్పుడు శబ్దం రావడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. కొన్నిసార్లు ఎలాంటి పొర అడ్డులేకుండా సైనస్ నేరుగా ముక్కు రంధ్రంలోకి తెరుచుకుంటుంది. ఆ సమయంలో స్రవించిన స్రావాలు వాటి మార్గంలో అడ్డుపడటం వల్ల శ్వాస సమస్యలు ఏర్పడుతాయి. దీనినే సైనసైటిస్ అంటారు.

లక్షణాలు : తలనొప్పి, ముక్కు దిబ్బడ, నీరు కారడం, దగ్గు, జలుబు సైనసైటిస్ లక్షణాలు. వాతావరణం మారినప్పుడల్లా వైరస్, బాక్టీరియా, ఇన్ఫెక్షన్ల వల్ల సైనసైటిస్ వస్తుంటుంది.

ఎన్ని రకాలు? : సింపుల్‌గా చెప్పాలంటే కళ్లు, ముక్కు, పక్కభాగం ఎముకల్లో ఉండే సన్నని గాలితో నిండిన సైనస్ భాగం ఇన్ఫెక్షన్లతో వాచిపోవడాన్ని సైనసైటిస్ అంటారు. దీనిలో ఫ్రాంటల్, పారానాసల్, ఎత్మియిటల్, యాగ్జిలరీ, స్ఫినాయిడల్ వంటి రకాలు ఉన్నాయి. కానీ ముఖ్యంగా వీటిని మూడు రకాలుగా చెప్తారు. ఒక్కో దశలో ఒక్కో రకమైన తీవ్రతతో ఉంటుంది.

1. అక్యూట్ సైనసైటిస్
2. సబ్ అక్యూట్ సైనసైటిస్
3. క్రానిక్ సైనసైటిస్

అక్యూట్ సైనసైటిస్ వారం రోజులుంటుంది. సబ్ అక్యూట్ 4-8 వారాలుంటుంది. క్రానిక్‌ను దీర్ఘకాలిక సైనసైటిస్ అంటారు. ఇది 8-10 వారాలు బాధిస్తుంది. ఇండియాలో కన్నా అమెరికాలో సైనసైటిస్ సమస్యలు ఎక్కువ అని సర్వేలు చెప్తున్నాయి. 2.4 లక్షల మంది అమెరికన్లు సైనసైటిస్‌తో బాధపడుతున్నారట. వ్యాధిని తేలికగా తీసుకోవడమే వ్యాధి తీవ్రతకు కారణంగా చెప్పుకోవచ్చు. ఆపరేషన్ చేసినా కూడా సరైన జీవనశైలి లేకపోతే ఈ సమస్య మళ్లీ వచ్చే ప్రమాదం ఉంది.

ఎలాంటి సమస్యలు?: సైనసైటిస్ వల్ల సైనస్ భాగంలో తీవ్రమైన ఒత్తిడి, నొప్పి కలుగుతాయి. చీముతో కూడిన స్రావాలు ముక్కు నుంచి బయటకు వస్తాయి. ముక్కు దిబ్బడగా ఉంటుంది. ముక్కులో ఇన్ఫెక్షన్లు మొదలవుతాయి. కొన్నిసార్లు సూక్ష్మజీవులు ఎక్కువగా ఉన్న నీళ్లలో ఈత కొట్టడం వల్ల అవి సైనస్‌లోకి ప్రవేశించి వ్యాధిని కలిగిస్తాయి. స్విమ్మింగ్ పూల్స్‌లో క్లోరిన్ ఎక్కువగా ఉంటే కూడా ఆ గాలి ముక్కు రంధ్రాల ద్వారా సైనస్‌లోకి చేరి మ్యూకస్ మెంబ్రేన్ వాచిపోతుంది. దంతాలలో వచ్చే ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా సైనస్ సమస్యలు వస్తాయి. దీర్ఘకాలికంగా సైనసైటిస్ వ్యాధితో బాధపడే వారు కనురెప్పల వాపు, కనుగుడ్లు పక్కకు జరిగి ఉండటం, కన్ను నరం దెబ్బతిన్నపుడు చూపు కోల్పోవడం, వాసన తెలియక పోవడం, తరచూ జ్వరం రావడం, ఎదుగుదల లోపాలు వంటి సమస్యలు వస్తాయి.

ఇతర సమస్యలూ కారణమే: వేరే ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే వాటి వల్ల కూడా సైనసైటిస్ సోకుతుంది. పుష్టికరమైన ఆహారం తీసుకోకపోవడం, చికెన్ పాక్స్, కోరింత దగ్గు, డయాబెటీస్ సమస్యలు ఉన్నట్లయితే సైనసైటిస్ వస్తుంది. చాలా కేసుల్లో సైనసైటిస్ వైరల్ ఇన్‌ఫెక్షన్‌గా మారుతుంది. తర్వాత బాక్టీరియా చేరి సైనస్ సమస్యగా మారుతుంది. ఈ హానికర సూక్ష్మజీవుల్లో స్ట్రెప్టోకోకస్ న్యుమోనియా, హీమోఫిలస్ ఇన్‌ఫ్లూయెంజా, స్టెఫైలోకోకస్ ఆర్ఈయస్ వంటి వాటివల్ల కూడా సైనసైటిస్ సమస్య వస్తుంది. మ్యూకోసల్ మెంబ్రేన్, సైనస్ ఎముకల మీద కూడా ప్రభావం వల్ల.. దంతాలకు ఉన్న అంటు సైనస్‌లకు వ్యాపించడం వల్ల సైనసైటిస్ సమస్య వస్తుంది.

వ్యాధి నిర్ధారణ: ముఖం భారంగా ఉండటం, తలనొప్పి, గొంతులోకి ద్రవం కారటం, చెవిలో చీము పట్టడం, కోపం, మానసిక స్థైర్యం కోల్పోవటం, అలసట, విసుగు, పనిపై శ్రద్ధ లేకపోవటం వంటి లక్షణాలు వరుస క్రమంలో ఉంటే సైనసైటిస్‌గా గుర్తించాలి. దీనిని సీటీ స్కానింగ్, ఎక్స్‌రే ద్వారా నిర్ధారిస్తారు.

కారణమేంటి?

సైనస్‌లో సరైన వెంటిలేషన్ లేకపోవడం ముఖ్య కారణం. సాధారణంగా సైనస్‌లో మ్యూకస్ ద్రవాలు సీలియరీ మూమెంట్ వల్ల ఆస్టియాను చేరి అక్కడ నుంచి ముక్కు రంధ్రాల్లోకి చేరుతాయి. ఇది జరుగకుండా సైనస్‌లో తయారయ్యే పదార్థాలు నిల్వ ఉండి విధులకు ఆటంకం కలిగిస్తాయి. ముఖ్యంగా నాసికా కవచం, స్ఫుటం నిర్మాణంలో తేడాలు ఏర్పడతాయి. కొందరికి ముక్కులోని ద్రవాల చిక్కదనం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. ఒకసారి సైనసైటిస్ వచ్చి మ్యూకోసా దెబ్బతింటే పదే పదే వచ్చే అవకాశాలు ఉన్నాయి. వాతావరణం తేమగా, చల్లగా ఉన్నప్పుడు వాటి ప్రభావం వల్ల సైనసైటిస్ వస్తుంది.

చికిత్స:

అమాక్సిసిల్లిన్ లేదా ఆంపిసిల్లీన్ మందులు ఇవ్వవచ్చు. ఓరల్ డ్రిక్సోరాల్, డిమెటాప్ మందులతో కూడా తగ్గుతుంది. స్టీమ్‌ను పీల్చుకొనుట ద్వారా హీట్‌ను కలిగించుట ద్వారా ముక్కు నుంచి స్రావాలు బయటకు రప్పించి ఉపశమనం కలిగించవచ్చు. నాసల్ స్ప్రేలు కొంతవరకు ఉపశమనాన్ని కలిగిస్తాయి. మందులకు తగ్గకపోతే మాత్రం శస్త్రచికిత్స ద్వారా సైనస్‌కు కారణమైన దుర్మాంసాన్ని తొలగించవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

-ఎలర్జీ కలిగించే వస్తువులను దూరంగా ఉంచాలి.


-తగిన పోషకాహారం తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవాలి.

-శ్వాసకోశ అంటువ్యాధులతో బాధపడుతూ ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి.

-శ్వాసకోశ వెలుపలి భాగాల్లో అంటు 7- 10 రోజుల కంటే ఎక్కువ ఉండకుండా చూసుకోవాలి.

-ముక్కు నుండి వచ్చే స్రావాల రంగు మారినా లేదా చెడు వాసన వస్తున్నా డాక్టర్‌ను సంప్రదించాలి.

-టాన్సిలైటిస్‌తో బాదపడుతున్నవారు వెంటనే ఈఎన్‌టీ నిపుణులను సంప్రదించాలి.



PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
శనివారం 25 అక్టోబర్ 2025

## ఖమ్మంలో శత జయంతి ముగింపు వేడుకలు..!!

- ఐదు లక్షలమందితో ర్యాలీ, భారీ బహిరంగ సభ..
- డిసెంబర్ 26న పెద్ద ఎత్తున సిపిఐ శ్రేణులు తరాలలని పిలుపు..
- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్..



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 24: స్థానిక ఏవిఆర్ ఫంక్షన్ హాల్లో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం వల్ల మల్ల సామేలు అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాలు ముగుస్తున్న సందర్భంగా శత జయంతి ముగింపు వేడుకలు ఖమ్మం జిల్లా కేంద్రంలో ఐదు లక్షల మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ మహాసభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా వివిధ రాష్ట్రాల నుంచి 40 దేశాల ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారని, ఈ బహిరంగ సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషిచేసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు దేశంలో కులమతాల మధ్య విభేదాలు సృష్టించి దేశ సంపదను కార్పొరేట్ వ్యవస్థకు మోడీ అప్పగించారని , కేంద్ర ప్రభుత్వ విధానాలవల్ల పేద మధ్యతరగతి సామాన్య ప్రజలు ఆర్థికంగా సామాజికంగా వెనకబడినారని విమర్శించారు ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్కే నాగుల్ మీరా, తూము కోటయ్య గుండె పిన్ని మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, యాస రోశయ్య, గుడిమెట్ల పోనేకంటి వెంకటేశ్వర్లు, సీతయ్య గార్లపాటి వీరభద్రం, అనుమల అశోక్, చిమట ముత్తయ్య, ఉదారి నాగయ్య కంచర్ల రాఘవేంద్రరావు పాలెపు ప్రభాకర్, కొండా వీరయ్య, చలమల నరసింహారావు, గుండెపిన్ని పుల్లారావు, చెరుకుమల్ల రాజేశ్వరరావు, బరగడ రమేష్, పత్తిపాటి మహేష్ ఎస్కే పుల్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

## పాలకమండలి సభ్యురాలుగా కోలా విశాలాక్షి ప్రమాణస్వీకారం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిదేవస్థానం పాలకమండలి సభ్యురాలుగా నేడు కోలావిశాలాక్షి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలాఆనంద్ సతీమణి శ్రీకాళహస్తి దేవస్థానంలోని దక్షిణామూర్తి వద్ద ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలాఆనంద్ పాల్గొన్నారు. అనంతరం కోలా విశాలాక్షి ముఖ్య అతిథులు సమక్షంలో ఆలయ అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టేసాయి, బోర్డ్ సభ్యులు,కూటమి నాయకులు, పట్టణ ప్రముఖులు కోలా విశాలాక్షి కి దేవస్థానం నందు శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు.కోలా విశాలాక్షి మరి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యురాలుగా తనకు అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి మరియు సీనియర్ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు .ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా కార్యాచరణ చేపడతామని తెలియజేశారు.

## రాజీవ్ నగర్ లో ఇచ్చిన పట్టాల విచారణ కేంద్రాలు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నేడు శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖి నది వద్ద ఉన్న వద్ద ఉన్న పంచాయతీరాజ్ అతిథి గృహం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.శ్రీకాళహస్తిలోని రాజీవ్ నగర్ నందు నవంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు రాజీవ్ నగర్ డ్రైవ్ పేరిట అధికారులతో రాజీవ్ నగర్ నందు గతంలో ఇచ్చిన పట్టాలను విచారణ చేయుటకు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని,ఈ కార్యక్రమానికి తాను ప్రతిరోజు ఒక గంట పాల్గొంటానని గతంలో ఒరిజినల్ పట్టాలు ఉన్న పట్టాదారులు వారి ఒరిజినల్ పట్టాలతో పాటు ఆధార్ కార్డు తీసుకొని రాజీవ్ నగర్ డ్రైవ్ ఏర్పాటు చేసిన ప్రదేశానికి రావలసిందిగా కోరారు ఈ డ్రైవ్ కార్యక్రమంలో ఆర్డిఓ.ఎమ్మార్వోలు, వీఆర్వోలు, పాల్గొంటారని, రాజీవ్ నగర్ లోని ఒరిజినల్ పట్టాదారులు తమ పట్టాలను అధికారులకు చూపిస్తే వారి వారి స్థలాలను ఈ కేవైసీ ద్వారా నమోదు చేపిస్తామని తెలియజేశారు ఎవరైనా పట్టాలు తీసుకురానీయడల వారి స్థలాలను రద్దుచేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేసే విధంగా కార్యాచరణ చేపడుతున్నామన్నారు కాబట్టి ప్రతి ఒక్కరు వారి వారి పట్టాలని తీసుకుని వచ్చి ఈ కేవైసీ చేయించుకుని. వారి వారి స్థలాలను భద్రపరుచుకోవాల్సిందిగా ఈ సందర్భంగా కోరారు.శ్రీకాళహస్తి రేపు జరగనున్న మెగాజాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోండి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తిలోని పంచాయతీ రాజ్ అతిథి గృహం నందు నేడు ఎమ్మెల్యే బొజ్జలసుధీర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే ప్రజల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ. రేపు శ్రీకాళహస్తిలోని నారద పుష్కరిని వద్ద ఉన్న విక్రమ్ జూనియర్ కళాశాల నందు మెగా జాబ్ మేళా నిర్వహింపబడుతుందని. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని వారి వారి స్థాయికి తగ్గ ఉద్యోగాలు పొందవలసిందిగా ఎమ్మెల్యే బజ్జల సుధీర్ రెడ్డి నిరుద్యోగులను కోరారు.

# ప్లాస్టిక్ వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు.

- ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో హార్మోన్ల సమతుల్యత లోపిస్తుంది
- రోజురోజుకు భారీగా పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్సుల వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు
- అవగాహన కల్పించడంలో విద్య, వైద్యశాఖలు విఫలం
- ముక్తసరిగా ముగిస్తున్న పేరెంట్స్ సమావేశాలు
- ప్లాస్టిక్ వస్తువులు కొనుగోలు చేసి అనారోగ్యాన్ని కొంటున్నారు
- ప్లాస్టిక్ తో సంక్రమించే అనర్థాలపై అవగాహన కల్పించాలి





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నిద్రలేచింది మొదలు పడుకునే వరకు మన జీవనంలో ప్లాస్టిక్ వినియోగం ఒక భాగమైపోయింది. ప్రతిది ప్లాస్టిక్‌తో చేసిన వాటినే వినియోగిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్స్‌లనే వాడుతున్నారు. ప్లాస్టిక్ బాక్స్‌ల్లో పెట్టిన వేడి వేడి ఆహర పధార్థాలు కొన్ని గంటలోనే ప్లాస్టిక్ లో ఉండే రసాయనాలు ఆహారంలో కలిసి క్యాన్సర్ మహమ్మారికి దారితీస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్స్‌లను కొనుగోలు చేసి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ప్లాస్టిక్ తో వచ్చే అనర్థాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావడంలో విద్యా, వైద్యశాఖలు విఫల మవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. చూసేందుకు రంగు రంగుల డిజైన్లతో ఎంతో ఆకర్శనీయంగా కార్టూన్ క్యారెక్టర్స్, గ్లిట్టర్ ఎఫెక్ట్స్‌తో పిల్లలను ఆకట్టుకునే విధంగా ప్లాస్టిక్ బాటిళ్లు, లంచ్ బాక్స్‌లు మార్కెట్లో తలుక్కు మంటున్నాయి. ప్రతి విద్యార్థి బ్యాగుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్స్‌లే దర్శనమిస్తున్నాయి. విద్యార్థులు ఆకట్టుకునే విధంగా ఆకర్షణీయంగా ప్లాస్టిక్ బాటిళ్లను తయారు చేసి మార్కెట్‌లోకి వదులుతుండడంతో వీటి అమ్మకాలు ఊహించని స్థాయికి చేరుకున్నాయి. పలు రకాల వెరైటీలు, తక్కువ ధర, బరువు తక్కువగా కనిపించే ప్లాస్టిక్ బాటిళ్ల వైపే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆకర్షితులై ప్రాణాంతకమైన రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. అనారోగ్యంతో పాటు పర్యావరణానికి హాని కలిగిస్తాయని తెలిసినను విద్యావంతులు, ఉన్నత వర్గాలు సైతం వీటి వినియోగాన్ని వదలకపోవడం గమనార్హం. ప్లాస్టిక్ వినియోగం మనిషి జీవితంలో భాగమైపోయింది. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా, పెద్దలు విధులకు హాజరు కావాలన్నా టిఫిన్, లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్స్ అన్నీ ప్లాస్టిక్‌వే ఉండడం గమనార్హం. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదయం ప్లాస్టిక్ బాక్సులలో ప్యాక్ చేసిన ఆహారం, మధ్యాహ్నం పిల్లలు భోజనం చేసే సమయానికి ఆహారంలో చాలా తేడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రసాయనాలు కరిగి విషపూరితమయ్యే ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, లంచ్ బాక్సులతో ప్రమాదమని తెలిసిను మార్కెట్‌లో దొరికే రకరకాల డిజైన్లు చూసి విద్యార్థులు వాటిపై మోజుపడి కొనుగొలు చేస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులను కొనుగోలు చేస్తే రోగాలను కొనుగోలు చేసినట్టేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరిగించిన వాటర్‌ను, అత్యంత శీతలమైన పదార్థాలను ప్లాస్టిక్ పాత్రలలో నింపితే సుమారు 90శాతం కెమికల్స్ అందులో కరిగి ఆ పదార్థాలను విషపూరితం చేస్తాయని దీంతో రోగాలు శరీరాన్ని కబళిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే ప్లాస్టిక్ బాటిళ్ల వ్యర్థాలు భూమిలో కరగాలంటే కనీసం 450 ఏళ్ల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. వీటి వినియోగం ఆరోగ్యానికే కాక పర్యావరణానికి ప్రమాదకరం. పాఠశాలలు, కళాశాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు సామాజిక వేత్తలు, ప్రభుత్వ అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు.ప్లాస్టిక్‌తో ప్రాణాంతక వ్యాధులు ప్లాస్టిక్‌లో బిస్ఫినాల్-ఏ (బీపీఏ), మైక్రో ప్లాస్టిక్స్ అనే రసాయనం అధికంగా ఉండటంతో కొద్ది మోతాదులోనైనా శరీరంలో చేరే ప్రమాదం ఉంది. దీంతో హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. శరీరంలోని గ్రంథులపై ప్రభావం చూపి వాటి పనితీరును మందగిస్తుంది. జీర్ణ సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయి. అతిశీతలం, అధిక వేడి పదార్థాల కోసం వీటిని వినియోగిస్తే పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రధానంగా ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్ మహమ్మారి కాటేసే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్‌ను ఇలానే వినియోగిస్తే 2030 నాటికి మన రాష్ట్రంలో 27 శాతం మంది క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు, మేధావుల గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. ప్రధానంగా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 25 ఏళ్ల లోపు పిల్లలు, యువతలోను ప్లాస్టిక్ వినియోగంచడంతో కలిగే అనర్థాలు ప్రాణాంతక వ్యాధులకు గురి చేస్తున్నాయి. గత 10 ఏళ్ల నుంచి రోజు రోజుకు పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వినియోగం అధికమవడమే ఇందుకు ప్రధాన కారణంగా వైద్యులు సూచిస్తున్నారు.

**తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి..**


పిల్లలకు టిఫిన్ బాక్స్‌లు, వాటర్ బాటిళ్ల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి లేదంటే భయంకర రోగాలతో ప్రమాధం పొంచి ఉంది. వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ డబ్బాలలో ఉంచడం ద్వారా రుచి, వాసన కోల్పోడంతో పాటు కొన్ని రకాల విష పదార్థాలు ఏర్పడి చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. నాణ్యత ప్రమాణాలు తక్కువగా ఉండే వాటర్ బాటిళ్లు, లంచ్ బ్లాక్స్‌లు వాడటంతో అందులోని కెమికల్స్ పొరలుగా ఆహారంలో కలిసి ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది.

ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజారోగ్యంపై అత్యంత ప్రభావం చూపే ప్లాస్టిక్ వస్తువులపై అవగాహన కల్పించడమే కాక ప్లాస్టిక్ వాడకాని పూర్తి స్థాయిలో నిషేధించాలని పలువురు కోరుచున్నారు.

# తార్నాక జలమండలిలో అవినీతి రాజ్యం

- మరమ్మత్తులలో నాసిరకం పనులు
- మరమ్మత్తుల పేరుతో కాసులు దండుకుంటున్న అధికారులు, కాంట్రాక్టర్లు
- డిప్యూటీ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్ నిర్లక్ష్యం అధికారులకు ధన లాభం
- రహదారిపై తాగునీరు పారుతున్న పట్టించుకోని అధికారులు
- తార్నాక చౌరస్తా, రాజ్యాంగాబి లేఖన కార్యాలయం ముందు నిత్యం తాగునీరు రోడ్డు పాలు





తార్నాక (ప్రశ్న న్యూస్)తార్నాక జలమండలి కార్యాలయంలో అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. ప్రజల సొమ్ము కాంట్రాక్టర్లు గద్దల్ల తినేస్తున్నారు. నాసిరికం పనులు చేయిస్తూ రోడ్లపై తాగునీరు, మురుగనీరు యదేచ్ఛగా పారుతున్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడు. రహదారులపై ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు తిరుగుతున్న వాళ్ళ దృష్టికి రాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అధికారులు కాంట్రాక్టర్లు చేస్తున్న నాసిరకం పనులతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై ఎప్పటికప్పుడు స్పందించవలసిన జలమండలి ఉన్నతాధికారులు నిమ్మకు నీనెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. డీజీఎం, జనరల్ మేనేజర్ అసలు పట్టించుకోవడంలేదని తార్నాక రహదారులపై తాగునీరు ఏరులై పారుతున్న నిమ్మకు నేరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులకు లక్షల్లో జీతాలు వస్తున్న కాంట్రాక్టర్ల కమిషన్లకు కక్కుర్తి పడి నాసిరకం పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తార్నాక చౌరస్తాలో సన్మాన్ హెూటల్ వద్ద, వెంకట్ రెడ్డి స్వీట్ హౌస్ ముందు, రాజ్యాంగాబి లేఖన కార్యాలయం ముందు గత కొంతకాలంగా తాగునీరు రోడ్డు పాలవుతుంటే పట్టించుకోకపోవడంతో స్థానికులు, వాహనాదారులు జలమండలి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసిన పత్రికలో కథనాలు వచ్చిన జలమండలి అధికారులు అసలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని దీనిపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోకుండా ఎందుకు మౌనం వహిస్తున్నారని వాహనాదారులు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగా జలమండలి పరిధిలో కాంట్రాక్టర్ల అవినీతి అంతా ఇంతా కాదు దస్తుతో మరమత్తు పనులు చేయించి కోట్లు గడిస్తున్నారు. మ్యాన్ హెూల్స్ మరమత్తు పనులను మూడునాళ్ళ ముచ్చటగా తూతూ మంత్రంగా చేసి వదిలేస్తున్నారు. రహదారిపై ఇలా చేయడంతో నిత్యలు ప్రమాదాలు జరుగుతున్నాయి ఇక్కడ కాంట్రాక్టర్ గత కొన్ని సంవత్సరాలుగా పాతుకుపోయి అధికారులకు లంచాల ఆశ చూపి నాసిరకం పనులు చేయిస్తూ ప్రజల సొమ్మును అడ్డంగా దిగమింగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తార్నాక జలమండలి పరిధిలో జరుగుతున్న అవినీతి అక్రమాలను విజిలెన్స్ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తాగిస్తోంది. జలమండలి లో విజిలెన్స్ అధికారులకు కాంట్రాక్టర్ల నుండి నెల నెల మామూలు వెళ్తున్నాయా.? అందుకోసమే పట్టించుకోవడం లేదా.? అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఇంత అధ్వాన్నంగా మ్యాన్ హెూల్స్ మరమ్మత్తులు చేస్తుంటే మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్ ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మ్యాన్ హెూల్ చేసిన నెలరోజులు లోపటే సిమెంటు పోవడం గుంతలు పడడం జరుగుతుందని తిరిగి మరమత్తులు చేస్తూ ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అయిన అలాంటి అవినీతి కాంట్రాక్టర్లకే అధికారులు పనులు అప్పగించి కమిషన్లు దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్న ఈ వ్యవహారం విజిలెన్స్ అధికారుల దృష్టికి రాలేదా.? మరి అధికారులు నిద్రపోతున్నారా.? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా జలమండలి పరిధిలో అవినీతి అక్రమాలు రాజమేలుతున్నాయని వాటిపై ప్రత్యేకంగా ఎండి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

# తెలుగు జాతిని ప్రపంచంలో నెంబర్ వన్ చేస్తా

- దుబాయ్ వేదికగా సీఎం చంద్రబాబు ధీమా
- దుబాయ్‌లో ఘనంగా తెలుగు డయాస్పోరా కార్యక్రమం
- భారీగా తరలివచ్చిన గల్ఫ్ దేశాల ప్రవాసాంధ్రులు
- తెలుగు జాతిని ప్రపంచంలోనే నెంబర్ 1గా నిలుపుతామన్న చంద్రబాబు
- గతంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్.. ఇప్పుడు విశాఖకు గూగుల్ అని వెల్లడి



అమరావతి (ప్రశ్న న్యూస్) యూఏఈ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, గల్ఫ్ దేశాల్లోని తెలుగు ప్రజలతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. తన పర్యటనలో చివరి కార్యక్రమంగా దుబాయ్‌లోని లీ మెరిడియన్ హెూటల్‌లో ఏర్పాటు చేసిన 'తెలుగు డయాస్పోరా' సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఓమన్, బహ్రెయిన్, ఖతార్ వంటి గల్ఫ్ దేశాల నుంచి ప్రవాసాంధ్రులు, తెలుగు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సభకు మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఏపీ ఎన్నార్టీ చైర్మన్ వేమూరి రవి తదితరులు హాజరయ్యారు. అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. "ప్రపంచంలో తెలుగు జాతికి తిరుగే లేదు. ప్రపంచంలో తెలుగు జాతిని నెంబర్ వన్ గా నిలబెట్టడమే నా లక్ష్యం. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా తెలుగువారు ఉన్నత స్థాయిలో ఉండాలని నేను మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు. 30 ఏళ్ల క్రితం తాను ఐటీకి పునాదులు వేయడం వల్లే నేడు తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా టెక్ నిపుణులుగా రాణిస్తున్నారని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ సీఈఓగా సత్య నాదెళ్ల వంటి వారు తెలుగువారి సత్తాను ప్రపంచానికి చాటుతున్నారని కొనియాడారు. 2024 ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం ప్రవాసాంధ్రులు ఎంతో తపించారని, వారి మద్దతు మరువలేనిదని కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తన వద్ద స్పష్టమైన ప్రణాళిక ఉందని చంద్రబాబు వివరించారు. "గతంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను తీసుకొచ్చాను. ఇప్పుడు అదే స్ఫూర్తితో విశాఖపట్నానికి గూగుల్ తీసుకువస్తున్నాం. సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ సంస్థ విశాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది" అని ప్రకటించారు. ఐటీ, కమ్యూనికేషన్ల రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకుంటున్నాం" అని తెలిపారు. పాలనలో సాంకేతికతను జోడిస్తూ వాట్సప్ ద్వారా 730కి పైగా పౌర సేవలను అందిస్తున్నామని, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చంద్రబాబు వివరించారు. అబుదాబీ, దుబాయ్ నగరాలు ఆయిల్ ఎకానమీ నుంచి పర్యాటకం, నాలెడ్జి ఎకానమీ వైపు ఎలా పయనిస్తున్నాయో స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. లక్షన్నర హెూటల్ రూములతో దుబాయ్ ఆతిథ్య రంగంలో అద్భుతాలు సృష్టిస్తోందని, అదే తరహా అభివృద్ధిని ఏపీలో సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588